


ఉపాధ్యాయ ఉద్యోగార్థుల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరదించి, ఒకే దఫాలో 15,941 పోస్టుల భర్తీ చేపట్టిన కూటమి ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీని నిలబెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీపై చేయగా, మంత్రి లోకేష్ పేరు చిరస్థాయిగా నిలిచింది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


శుక్రవారం 26.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 161 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఇక ప్రతి ఏడాది డీఎస్సీ

బాబు ష్యూరిటీ... జాబు గ్యారెంటీ నినాదాన్ని నిజం చేస్తున్నాం

అత్యంత పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టాం

విద్యార్థులకు టీచర్లు నైతిక విలువలు బోధించాలి

ఉపాధ్యాయులూ నిత్యం అప్డేట్ అవుతూ ఉండాలి

మెగా డీఎస్సీ విజేతల సభలో సీఎం చంద్రబాబు

మెగా డీఎస్సీని సమర్థవంతంగా నిర్వహించిన మంత్రి లోకేష్ బృందానికి సీఎం అభినందనలు






**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిరుద్యోగులు, ఈ ఏడాది డీఎస్సీలో క్వాలిఫై కాని వారంతా ప్రిపేర్ అవుతూ ఉండాలని సూచించారు. ఇకపై ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని... దాని కోసం ప్రత్యేకంగా అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని మంత్రి నారా లోకేష్ కు సీఎం చంద్రబాబు చెప్పారు. మెగా డీఎస్సీలో విజేతలకు ఉపాధ్యాయ పోస్టుల నియామక పత్రాలను జారీ చేసే కార్యక్రమం గురువారం రాష్ట్ర సచివాలయం సమీపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన 15,941 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. అన్ని జిల్లాల నుంచి నియామక పత్రాలు అందుకునేందుకు కుటుంబ సభ్యులతో సహా కొత్తగా రిక్రూట్ అయిన టీచర్లు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."సీఎంగా బాధ్యతలు చేపట్టాక తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే పెట్టాను. అవినీతి లేకుండా పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టాం... టీచర్ల నియమించాం. 150 రోజుల్లో ఈ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టిన మంత్రి నారా లోకేష్ బృందాన్ని అభినందిస్తున్నాను. ఇక టీచర్లుగా నియామక పత్రాలు తీసుకున్న ఉపాధ్యాయులను అభినందిస్తున్నాను. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా బాబు ష్యూరిటీ... జాబు గ్యారెంటీ అని చెప్పాను... దాన్ని నిజం చేస్తున్నాం. రూ. 10 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకున్నాం.. 10 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయి. 15 ఏళ్లల్లో 14 సార్లు డీఎస్సీని పెట్టాం.. 1,96,619 ఉద్యోగాలిచ్చాం. ఇక పైనా ప్రతి ఏడాది డీఎస్సీ ఉంటుంది." అని సీఎం చెప్పారు.

**చదువు చెప్పడంలో మహిళలే బెస్ట్ :** "సూపర్ సిక్స్ హామీల్లో మొదటి హామీ యువతకు 20 లక్షల ఉద్యోగాలివ్వడమే. దాంట్లో భాగంగా మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశాను. మెగా డీఎస్సీని సూపర్ హిట్ చేశారు. ఉద్యోగం సంపాదించాలన్న మీ కోరిక తీరింది... పేదరికం లేని సమాజం చూడాలనేది నా కోరిక.

మిగతా 2లో...

## నా జీవితకాల గురువు సీఎం చంద్రబాబు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** దేశానికి అధినేత అయినా గురువు వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిందేనని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. వెలగపూడిలోని సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై 15,941 మంది మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సీఎం చంద్రబాబు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. "నాకు జీవితకాల గురువు సీఎం చంద్రబాబు. పదో తరగతి వరకు నేను నామమాత్రంగా చదివేవాడిని. ఫండమెంటల్స్‌లో చురుగ్గా లేనని నారాయణ పాఠాలు చెప్పారు. అమెరికా వెళ్లినప్పుడు ప్రొ.రాజిరెడ్డి.. విద్యావ్యవస్థ గురించి చెప్పారు. వీళ్ల వల్లే ఇవాళ నేను మీ ముందు నిల్చున్నా. యువగళం పాదయాత్రలో నిరుద్యోగ యువతను కలిశా. అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీపైనే తొలి సంతకం అని చెప్పా. సీబీఎన్ అంటే డీఎస్సీ.. డీఎస్సీ అంటే సీబీఎన్" ఉమ్మడి ఏపీలో 15 డీఎస్సీలు జరిగితే తెదేపా హయాంలోనే 14 డీఎస్సీలు నిర్వహించాం. తెలుగుదేశం హయాంలో 2లక్షల మంది టీచర్లను నియమించాం. సమష్టి కృషి వల్లే మెగా డీఎస్సీ మెగా హిట్ అయ్యింది.

మిగతా 2లో...

## పక్కదారి పట్టిన పరకామణి సొమ్ము లెక్క తేలుస్తాం

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** భక్తుల నమ్మకానికి ప్రతీకగా సమర్పించె,పరకామణి సొమ్మును కూడా పలహారంలా తినేసిన వైసిపి నాయకుల పాపం పండే, ఏడుకొండల స్వామి, ఓటర్ల ద్వారా పదకొండు సీట్లకు పరిమితం చేశాడని, వైసీపీ కుట్ర, కుయుక్తులకు నెలవని, పట్టభద్రులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆరోపించారు.

మున్సిపల్ మార్కెట్ సెంటర్లో గురువారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్,మహా పాపం, దేవుని పరకామణి డబ్బులు దొంగతనం,అనే ప్రచార బ్రోచర్ను ఆవిష్కరించారు. తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత వైసిపి పాలన కుట్రలకు కుతంత్రాలకు నెలవని అన్నారు. తిరుమల స్వామివారిని దర్శించిన భక్తులు, తమ అభీష్టాలు నెరవేరాలని, పరకామణి ద్వారా సమర్పించే దక్షిణను సైతం వదిలిపెట్టలేదని ఆరోపించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు, హయాంలో, పింక్ డైమండ్ మాయమైందని ఆరోపణలు చేసిన వైసీపీ నాయకులు, 2019లో అధికారంలోకి రాగానే, అలా అ-నలేదు ఆ మాటలు వెనక్కి తీసుకుంటామన్నాకూడా,

మిగతా 2లో...




## మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత



● 34 లక్షల మంది మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

● 2వరకు శిబిరాలు కొనసాగింపు

● వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

● నున్నలో ఉచిత వైద్య శిబిరం సందర్శన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17 నుంచి ప్రారంభమైన "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా సుమారు 34 లక్షల మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. 16,000 పైగా వైద్య శిబిరాల ద్వారా మహిళలు ఉచిత పరీక్షలు చేయించు కుంటున్నారన్నారు. మహిళలు 8 రకాల ఉచిత పరీక్షలు చేయించు కుంటున్నారన్నారు.

మిగతా 2లో...

## కలసికట్టుగా ఎపి మోడల్ ఎడ్యుకేషన్‌ను ప్రపంచానికి చాటుదాం

నవంబర్‌లో మళ్లీ టెట్ నిర్వహిస్తాం... టీచర్ పోస్టులన్నీ భర్తీచేస్తాం

2

150రోజుల్లో 150 కేసులు వేసినా విజయవంతంగా డిఎస్సీ పూర్తిచేశాం

గురువుల మార్గదర్శనం వల్లే నేను ఈ స్థాయికి చేరుకున్నా

## ఈగల్‌తో గంజాయికి కట్టడి

గత ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు లేవు

గతంలో స్కూల్ పిల్లలకు గంజాయి పంపిణీ చేసే దుస్థితి

సీఎం కఠినంగా వ్యవహరించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది

2

రాజకీయ ముసుగులో ఉన్న నేరగాళ్లు సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నారు

శాసనసభలో హెూం మంత్రి అనిత

## మహిళలకు గార్మెంట్ పరిశ్రమల్లో ఉపాధి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మహిళా సాధికారితలో భాగంగా టైలరింగ్ లో ఉచిత శిక్షణ పొందిన మహిళలకు రాష్ట్రంలోని వివిధ గార్మెంట్ పరిశ్రమల్లో ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శాసన సభా సమావేశాల్లో ఆరో రోజు గురువారం ఎమ్మెల్యే బత్తుల బాలరామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి సవిత పైవిధంగా సమాధానమిచ్చారు.

మిగతా 2లో...

# కంగ్రాట్స్ లోకేష్,,'మెగా డీఎస్సీ మెగా హిట్'

పరిపూర్ణమైన సీఎం చంద్రబాబు మేనిఫెస్టో హామీ తొలి సంతకం

ఒక్కసంతకంతో 15,941 మంది జీవితాల్లో వెలుగులు

ఆద్యంతం వినూత్నంగా మెగా డీఎస్సీ ఉత్సవ్





**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మెగా డీఎస్సీ మెగా హిట్ అయ్యింది. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తొలి సంతకం వేలాది మంది కుటుంబాల్లో వెలుగులు నింపింది. ఒక్కసంతకంతో 15,941 మంది డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఉద్యోగ నియామకాలు పొందారు. వీరికి ఉద్యోగ నియామక పత్రాలను అందించేందుకు నిర్వహించిన మెగా డీఎస్సీ ఉత్సవ్ సభ ఆద్యంతం అద్భుతంగా జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక... చేపట్టిన కార్యక్రమాలన్నీ ఓ ఎత్తుగా ఉంటే... మెగా డీఎస్సీ ఉత్సవ్ సభ మరో ఎత్తుగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వారికి నియామక ఉత్తర్వుల అందజేతతో మేనిఫెస్టోలోని మొదటి సంతకం హామీ పరిపూర్ణమైంది. కోర్టు కేసుల లాంటి అనేక సవాళ్లను, కుట్రలను దాటుకుని డీఎస్సీ కార్యక్రమాన్ని విద్యా శాఖ నిర్వహించింది. మొత్తం 15, 941 పోస్టుల భర్తీతో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలు పొందిన వారితో అమరావతిలో నిర్వహించిన మెగా డీఎస్సీ ఉత్సవ్ మెగా హిట్ అయ్యింది. కుటుంబ సభ్యులతో కలిసి నియామక ఉత్తర్వులు అందుకునే కార్యక్రమంలో మెగా డీఎస్సీ విజేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకూ :** డీఎస్సీ నోటిఫికేషన్ నుంచి టీచర్లకు నియామక ఉత్తర్వులు అందజేసే కార్యక్రమం వరకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మెగా డీఎస్సీ లో నియామకాలు పొందిన టీచర్లకు పత్రాలు అందించేందుకు విద్యాశాఖ వినూత్నంగా, ఆసక్తికరంగా కార్యక్రమాన్ని నిర్వహించింది. సభలోకి నేతల ఎంట్రీ నుంచే అదుర్స్ అనిపించే రీతిలో సభ జరిగింది. సభ ప్రాంగణంలో నలువైపులా ఏర్పాటు చేసిన ర్యాంప్ పై చంద్రబాబు, లోకేష్, మాధవ్ అభివాదం చేసుకుంటూ వెళ్లారు.

మిగతా 2లో...


## పక్కదారి పట్టిన పరకామణి సొమ్ము లెక్క తేలుస్తాం




(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలోని నిజం నిగ్గు తేల్చాలని, తెలుగుదేశం పార్టీగా కోర్టుకు వెళ్లడం జరిగిందని గుర్తు చేశారు. పరకామణి దక్షిణ ద్వారా వందల కోట్ల డాలర్లు, నాడు వైసీపీ ప్రభుత్వంలో దోచేసారని ఆరోపించారు. అందుకే ప్రజలు 11 స్థానాలకు పరిమితం చేశారని, మరలా ఇప్పుడు తగుదునమ్మా అంటూ,మేము అధికారంలోకి వస్తే ఏదో చేసేస్తామంటూ, ప్రగల్భాలు పలుకుతున్నారని, వైసిపి వారు వచ్చేది లేదు చేసేది లేదంటూ ఎమ్మెల్సీ ఆలపాటితమదైన శైలిలో అన్నారు. ప్రజలు వైసిపి మోసాలను దుర్మార్గాలను ఎప్పటికీ మర్చిపోరని, ఎన్నికలుఏవైనా, వైసీపీకి ప్రజలు తగు బుద్ధి చెప్తారని అన్నారు. పరకామణి ద్వారా దోచేసిన దేవుని సొమ్మును రాబట్టే విషయంలోనూ, దేవుని ఆస్తులను కాపాడే విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహమ్మద్ కుద్దూస్, పసుపులేటి త్రిమూర్తులు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాద్, జొన్నాదుల మహేష్, సౌపాటి కిరణ్, గుమ్మడి ప్రసాద్, కౌన్సిలర్లు దీవి అనిత, బోయపాటి అరుణ, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, కొండా రమాదేవి, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, తదితర పార్టీలోని పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నా జీవితకాల గురువు సీఎం చంద్రబాబు



(మొదటి పేజీ తరువాయి)

150 రోజుల్లో 150 కేసులు వేసినా నియామకాలు పూర్తి చేశాం. విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చే విధంగా చర్యలు చేపట్టాం. విద్యా వ్యవస్థను రాజకీయాలకు దూరంగా పెట్టాం. ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని సీఎం చెప్పారు. నవంబర్‌లో మరోసారి టెట్ నిర్వహిస్తున్నాం. వచ్చే ఏడాది మళ్లీ డీఎస్సీ నిర్వహిస్తాం. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సి ఉంది. ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ప్రపంచానికి చూపిద్దాం. ఫిన్లాండ్, సింగపూర్‌లో విద్యా వ్యవస్థపై అధ్యయనం చేయాల్సి ఉంది" అని లోకేశ్ అన్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి మెగా డీఎస్సీ విజేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఈగల్‌తో గంజాయికి కట్టడి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శాసనసభలో మాట్లాడిన ఆమె, గత ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు లేనని, మద్యం ధరల భయంతో యువత గంజాయి వైపు మొగ్గుచూపిన దుస్థితిని గుర్తుచేశారు. అప్పట్లో స్కూల్ పిల్లలకే గంజాయి పంపిణీ చేసే దుస్థితి ఉండేదని, సీఎం చంద్రబాబు నాయుడు కఠినంగా వ్యవహరించడంతో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చింది అని అన్నారు. గంజాయి మాఫియాను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్' విభాగం ద్వారా 40 వేలకు పైగా ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు.

**నేరాలపై శాతం తగ్గుదల :** జాతీయ స్థాయిలో వచ్చిన నివేదికల ప్రకారం రాష్ట్రంలో నేరాలు 60 శాతం మేరకు తగ్గాయని మంత్రి తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా 'శక్తి' మొబైల్ యాప్‌ను తీసుకువచ్చాం. అలాగే న్యాయవ్యవస్థను పటిష్ఠం చేయడం వల్ల కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నాయి అని చెప్పారు.

**ఫోరెన్సిక్ వ్యవస్థ పునరుద్ధరణ :** గత పాలనలో ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణాన్ని నిలిపివేశారు. మేము ప్రభుత్వంలోకి వచ్చేసరికి 25 వేల ఫోరెన్సిక్ నివేదికలు పెండింగ్‌లో ఉండగా, వాటిని 1600 కు తగ్గించాం. ఇది మా కట్టుబాటును చూపిస్తుంది అని అనిత పేర్కొన్నారు.

**సోషల్ మీడియా ముప్పు పై ఆందోళన :** రాజకీయ ముసుగులో ఉన్న నేరగాళ్లు సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నారని, వారి ఉన్మాదం పరిశ్రమల అభివృద్ధికే అడ్డంకిగా మారిందన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం పట్ల విద్వేష ప్రచారం జరుగుతోందని, కొందరు కులాల పేర్లు మార్చుకుని అసభ్య పోస్టులు పెడుతున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ కుమార్తెపైనా అసభ్యంగా మాట్లాడటం దారుణమని చెప్పారు. ఈ తరహా సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు చట్టాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని హోం మంత్రి హితవు పలికారు.

## మహిళలకు గార్మెంట్ పరిశ్రమల్లో ఉపాధి

(మొదటి పేజీ తరువాయి)

మహిళా పక్షపాతి సీఎం చంద్రబాబు అని, ప్రతి ఇంటి నుంచి మహిళను పారిశ్రామిక వేత్తగా తయారు చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో మహిళల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. 2019-24 మధ్య అప్పటి ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. మళ్లీ సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా, ఏపీ బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి మహిళల జీవనోపాధి నిమిత్తం ఉచిత టైలరింగ్ శిక్షణ అందజేస్తున్నామన్నారు. 90 రోజుల పాటు టైలరింగ్ శిక్షణ అందజేస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్ ఉచితంగా ఇవ్వడమే కాకుండా సర్టిఫికెట్ కూడా ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో మహిళల కుట్టు శిక్షణ విజయంతంగా నిర్వహిస్తున్నామని, శిక్షణ పట్ల మహిళల్లో సంతోషం వ్యక్తమవుతోందని అన్నారు. శిక్షణకు హాజరయ్యే మహిళలను ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) హాజరు తీసుకుంటున్నామన్నారు. మహిళల ఉపాధి కల్పనకు ఏపీ స్కిల్ డవలప్ మెంట్ తో కలిసి పనిచేస్తున్నామన్నారు. పలు గార్మెంట్ సంస్థల యాజమాన్యాలతో మాట్లాడి, టైలరింగ్ లో శిక్షణ పొందిన మహిళలకు ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సవిత సభకు వెల్లడించారు.

# ఇక ప్రతి ఏడాది డీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

పేదరికం లేని సమాజాన్ని చూడాలంటే... విద్యతోనే సాధ్యం.. దాన్ని టీచర్లే నెరవేర్చాలి. మగవాళ్లకంటే మహిళలే మంచిగా చదువు చెప్పగలరు. ఇంటిని కూడా మహిళలే చక్కగా తీర్చిదిద్దుతారు. అందుకే సంక్షేమ కార్యక్రమాలు అందించే విషయంలో మహిళలకే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నాం. మహిళలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తెచ్చాం. స్త్రీ శక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. దీపం పథకం అమలు చేస్తున్నాం. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలున్నా.. వారందరికీ రూ. 15వేల చొప్పున తల్లుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. ప్రధాని సూపర్ జీఎస్టీ తెచ్చారు... ధరలు తగ్గించారు. దసరా, దీపావళి పండుగలను ఆనందంగా జరుపుకోవాలి. అభివృద్ధితో ఉద్యోగాలు వస్తాయి... ఆదాయం పెరుగుతుంది.. సంక్షేమం సజావుగా సాగించవచ్చు." అని చంద్రబాబు అన్నారు.

**విద్యా రంగాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు... :** "తొలిసారిగా సీఎం అయినప్పటి నుంచి విద్య పైనే ఎక్కువ శ్రద్ధ పెట్టాను. ఐటీ చదవమని ఆ రోజుల్లో చాలా మందికి చెప్పాను... కొందరు నా మాటపై నమ్మకంతో పట్టణాలకు వచ్చి చదువుకున్నారు. ఆ రోజు చక్కగా చదువుకున్నవారు... ఇప్పుడు విదేశాలకు వెళ్లారు.. బాగా స్థిరపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రులందరూ కలిసి ఎంత మంది టీచర్లను నియమించారో... నేను ఒక్కడినే అంత మంది టీచర్లను నియమించాను. ఇదీ నేను విద్యా రంగానికి ఇచ్చే ప్రాధాన్యత. విద్యా రంగాన్ని నేను ఎప్పుడూ అశ్రద్ధ చేయలేదు.. నిర్లక్ష్యం చూపలేదు. టీచర్లుగా బాధ్యతలు తీసుకున్న మీరంతా బాగా పని చేయాలి...



మంచి పేరు తీసుకురావాలి. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేలా టీచర్లంతా పని చేయాలి. విద్యా రంగంలో సంస్కరణలు తెస్తున్నాం... సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. పేరెంట్-టీచర్ మీటింగులు నిర్వహిస్తున్నాం. మన బడి-మన భవిష్యత్ పేరుతో మౌళిక సదుపాయాల కల్పన చేపడుతున్నాం. టీచర్ల బదిలీల చట్టంతో పారదర్శకంగా ఒక్కఫిర్యాదు కూడా లేకుండా టీచర్ల బదిలీలు పూర్తి చేశాం. నారా లోకేష్ నో బ్యాగ్ డే విధానం తెచ్చారు... ఇది వినూత్నంగా ఉంది. స్కూళ్లు తెరిచేలోగానే స్కూల్ కిట్లు, పుస్తకాలు ఇచ్చాం." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**విలువలతో కూడిన విద్యనందించాలి :** "విలువలతో కూడిన విద్యను అందించేలా టీచర్లంతా పని చేయాలి. పిల్లల్లో నైతిక విలువలను పెంచేలా టీచర్లు పాఠాలు చెప్పాలి. పిల్లల్లో నైపుణ్యాలు పెంచే బాధ్యత టీచర్లు తీసుకోవాలి. భవిష్యత్తులో విద్యా రంగంలో ఎలాంటి మార్పులు రాబోతున్నాయోననేది టీచర్లు ఊహించగలగాలి. మారిన పరిస్థితులకు అనుగుణంగా టీచర్లు అప్డేట్ అవుతూ ఉండాలి. నేను నిత్య విద్యార్థిని... కొత్త విషయాలు నేర్చుకుంటాను.. ప్రజలకు ఉపయోగపడే అంశాలు ఉంటే వాటిని అమలు చేస్తాను. కూటమి ప్రభుత్వం వచ్చాకే విద్యా వ్యవస్థలో మార్పులు వచ్చాయి. నో అడ్మిషన్లు బోర్డులు పెట్టే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలను తెచ్చారు... ఇది మరింతగా పెరగాలి. విద్యా శాఖ కఠినంగా ఉంటుందని చెప్పాను.. అయినా లోకేష్ ఛాలెంజ్ గా తీసుకున్నారు. ప్రాథమిక విద్య బాగుంటే ఉన్నత చదువులు అద్భుతంగా ఉంటాయి.. దీంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుంది." అని సీఎం వివరించారు.

**మంచి చేయరు... చేస్తే ఓర్వలేరు :** "ఏపీలో ఓ చేతకాని పక్షం ఉంది. ఆ చేతకాని పక్షం మంచి చేయదు. మంచి జరుగుతుంటే ఓర్వలేదు. డీఎస్సీని అడ్డుకునేందుకు 106 కేసులు వేశారు. కానీ ఇబ్బందులను అధిగమించి డీఎస్సీ నిర్వహించారు. పోస్టింగుల కోసం పైరవీలు చేసే పరిస్థితి గతంలో ఉండేది. కానీ టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ ప్రతిభ ఆధారంగానే పోస్టింగులు ఇచ్చాం. 2019-24 మధ్య కాలం విద్యా వ్యవస్థకు ఓ శాపం. 10 లక్షల మంది పిల్లలు గత పాలకుల హయాంలో ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిపోయారు. ఏపీ విద్యా రంగాన్ని 19వ స్థానానికి దిగజార్చారు. ఇంగ్లీష్ మీడియం పేరుతో ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేశారు. తెలుగు మీడియంను రద్దు చేశారు. ఇంగ్లీష్ మీడియం అంటూ కొందరిని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. రాజకీయాల కోసం విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు." అని ముఖ్యమంత్రి విమర్శించారు.

**టీచర్లతో ముఖాముఖి :** గతంలో జరిగిన కార్యక్రమాలన్నింటికంటే భిన్నంగా జరిగిన ఈ సభలో కొత్తగా నియమితులైన టీచర్లతో సీఎం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తనను రాజకీయాల్లో ప్రోత్సహించిన ఎకనామిక్స్ ప్రొఫెసర్ డీఎల్ నారాయణను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. పిల్లలను ప్రోత్సహిస్తే.. ఎంతటి కష్టమైన పనిని అయినా... సులభంగా సాధిస్తారని సీఎం చెప్పారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గమనించాలని... సమాజానికి మంచి పేరు తెచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్ పాల్గొన్నారు.

## కలసికట్టుగా ఎపి మోడల్ ఎడ్యుకేషన్‌ను ప్రపంచానికి చాటుదాం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు చెప్పిన విధంగా ఇకపై ప్రతిఏటా డిఎస్సీ నిర్వహిస్తాం, నవంబర్ లో టెట్ చేపడతాం, వచ్చేఏడాది మళ్లీ పారదర్శకంగా డిఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సచివాలయం సమీప ప్రాంగణంలో మెగా డిఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 150రోజుల్లో డిఎస్సీ నిర్వహించడం ఒక చరిత్ర, ఇది నెవర్ బిఫోర్, ఎవర్ ఆఫ్టర్. రాష్ట్ర ప్రజలందరి ఆశీస్సులతో మాకు మూడుతరాలు డిఎస్సీ ప్రకటించే అవకాశం వచ్చింది. ఎన్టీఆర్, చంద్రబాబు తర్వాత నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు చేతులెత్తి నమస్కరిస్తున్నా. సమిష్టి కృషితో ప్రభుత్వ విద్యావ్యవస్థను దేశానికే దిక్సూచిగా మారుద్దాం...ఎపి మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం అంతా కలసికట్టుగా కృషిచేద్దాం. విద్యారంగాన్ని రాజకీయాలకు అతీతంగా ఉంచేందుకు వ్యవస్థలో పలు కీలకమైన సంస్కరణలు తెచ్చాం. సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో విద్యార్థిమిత్ర, డొక్కాసీతమ్మ గారి పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాం. ప్రాథమిక విద్యలో నాణ్యత పెంచేందుకు 9600 స్కూళ్లలో వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని తెచ్చాం. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావుగారిని క్యాబినెట్ ర్యాంకుతో సలహాదారుగా నియమించాం. కారు, ఫోన్ తోపాటు కనీసం బాటిల్ నీరు కూడా ఆయన తీసుకోలేదు. ఆయన నిబద్ధతను అభినందిస్తున్నా. నైతిక విలువలపై తాను రాసిన నాలుగు పుస్తకాలను విద్యార్థులకు అందించాలని ఆయన కోరారు. మహిళలను గౌరవించడం నర్సరీ నుంచే నేర్పించాలి. మార్పు మన ఇంటినుంచే రావాలి. మా ఇంట్లో మా తల్లి నుంచే గౌరవిస్తున్నాం. 1,2 తరగతుల పుస్తకాల్లో ఇంటిపనుల ఫోటోలను చెరో సగంగా ఉండేలా మార్పులు చేశాం. పాఠశాల విద్యలో అనేక సంస్కరణలు తీసుకువచ్చాం. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించాం.. శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. నైతిక విలువలు, లింగ సమానత్వం, రాజ్యాంగం గురించి పాఠాలు రూపొందించామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

**డిఎస్సీ అంటే సిబిఎన్... :** తెలుగుదేశం పార్టీ విద్యకు ఎప్పుడూ ఫస్ట్ ప్రయారిటీ ఇస్తోంది. సిబిఎన్ అంటే డిఎస్సీ... %ఙూజ% అంటేనే %ఙణూ% గా పేరుపడింది. ఇప్పటివరకూ 14 సార్లు డీఎస్సీలు నిర్వహించ 2 లక్షల



టీచరు పోస్టులు భర్తీ చేశాం. సెప్టెంబర్ 5న టీచర్స్ డేకి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు హాజరయ్యారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు నిర్వహించిన డీఎస్సీలో ఎంపికైన వారు చేతులు ఎత్తండని కోరితే...హాలులో 99 శాతం మంది చేతులు ఎత్తారు. ఇదీ తెలుగుదేశం పార్టీ ఘనత....ఇదీ చంద్రబాబు గారి డీఎస్సీల చరిత్ర. ముఖ్యమంత్రిగా చంద్రబాబు గారు ప్రమాణ స్వీకారం చేసిన రోజున తొలి సంతకం మెగా డీఎస్సీ పై పెట్టారు. చాలా మంది నవ్వారు.. కొందరు విమర్శించారు. కానీ డీఎస్సీల నిర్వహణలో టీడీపీ, చంద్రబాబు గారి ట్రాక్ రికార్డు వీరెవ్వరికీ తెలియదు. బాబు గారు ఒక్కసారి కమిటైతే.. ఆ టాస్క్ కంప్లీట్ అయ్యే వరకూ ఆగరని ఈ డీఎస్సీ రిక్రూట్మెంట్ స్పష్టం చేసింది.

**అడ్డుకోవాలనే కుట్రతో కేసులు వేయించారు :** డీఎస్సీ ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదనే కుట్రతో కొందరు 150కిపైగా కేసులు వేయించారు. అధికారులు, న్యాయ సలహాలు తీసుకుంటూ ఎటువంటి లీగల్ సమస్యలు రాకుండా చూసుకున్నారు. 150 కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటూనే 150 రోజుల్లో డీఎస్సీ విజయవంతంగా నిర్వహించారు. మెగా డీఎస్సీ మెగా హిట్ కావడానికి కృషి చేసిన అధికారులు కోన శశిధర్, విజయరామరాజు, బి.శ్రీనివాసరావు, ఆకుల వెంకటరమణలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మెగా డీఎస్సీని ప్రభుత్వం 150 రోజుల్లోనే పూర్తిచేసి రికార్డు సృష్టించాం. సుమారుగా 16 వేల పోస్టులు ఒకేసారి భర్తీ చేయడం మరో రికార్డు. ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాత నిర్వహించిన మొదటి డీఎస్సీ లోనే ఇంప్లిమెంట్ చేశాం. స్పోర్ట్స్ కోటా 3 శాతం ఈ డీఎస్సీలో అమలైంది. మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, స్పోర్ట్స్ కోటా సహా అన్ని కేటగిరీల్లో వెర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లు పకడ్బందీగా పాటించాం. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో పురుషులకు సమానంగా మహిళలకు అవకాశాలు దక్కాలని తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి పనిచేస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి అత్యధికంగా డీఎస్సీలో 49.9% పోస్టులను మహిళలకు దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉంది.


**యువగళం యాత్రలోనే మెగా డీఎస్సీ ఆలోచన :** ఇంట్లో మొదటి గురువు అమ్మ. హెడ్ మాస్టర్ నాన్న. బడిలో గురువులే అమ్మానాన్నలు. అమ్మానాన్నల తరువాత పిల్లలు ఎక్కువ ఉండేది టీచర్ల తోనే. ప్రపంచంలో ఒక గొప్ప ఆస్తి ఉంది. అది దొంగలు దోపిడీ చెయ్యలేరు. అన్నదమ్ములు వాటాలు అడగరు. ఇతరులు మోసం చేసి తీసుకోలేరు. అదే విద్య. ఎంతో విలువైన విద్యా ఆస్తిని మీరంతా పిల్లలకు ఇవ్వబోతున్నారు. యువగళం పాదయాత్ర నుండి పుట్టింది మెగా డీఎస్సి ఆలోచన. పాదయాత్ర లో నడిచేప్పుడు యువతీయువకులతో మాట్లాడేవాడిని. వాళ్ళు ఒక్కటే చెప్పేవారు. మేమంతా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్నాం. వైసిపి ప్రభుత్వం ఒక్క డీఎస్సి కూడా నిర్వహించలేదు. మీరు అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ వేయాలి అని కోరేవారు. అప్పుడే మెగా డీఎస్సీ ఆలోచన మొదలైంది. చంద్రబాబు గారు తొలి సంతకం డిఎస్సీపైన పెడతారని అప్పుడే చెప్పాను. నూతన ఉపాధ్యాయులంతా పట్టుదల, కమిట్ మెంట్ తో పనిచేయాలి. విద్యావ్యవస్థలో మార్పుతేవాలి. విద్య అంటే ఫిన్ ల్యాండ్, ఢిల్లీ మాత్రమే కాదు. ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రపంచానికి చూపాల్సిన బాధ్యత మీ అందరిపై ఉంది. వ్యవస్థలో మార్పు తెస్తానని విద్యాశాఖను కోరి మరీ తీసుకున్నా. అందరం కలసికట్టుగా పనిచేద్దాం, ప్రపంచానికి ఆంధ్రామోడల్ చూపిద్దాం. అయిదేళ్లలో ప్రతి విద్యార్థికి గ్యారంటీడ్ ఎఫ్ఎల్ ఎన్ అందిద్దాం. ఉత్తమ ఉపాధ్యాయులను ఫిన్ ల్యాండ్, సింగపూర్ అధ్యయనానికి పంపించాలని ముఖ్యమంత్రి గారికి నా విన్నపం.

**గురువుకు దక్కిన గొప్పగౌరవం :** ఒక గురువు దక్కిన గొప్ప గౌరవం గురించి ఈ రోజు మీకు చెబుతాను. అది అక్టోబర్ 3, 1996సంవత్సరం. అప్పటి రాష్ట్రపతి గౌరవనీయులైన శంకర్ దయాళ్ శర్మ గారు ఒమన్ దేశం అధికారిక పర్యటనకు వెళ్లారు. మస్కట్ ఎయిర్ పోర్టుకు ఏకంగా ఒమన్ రాజు ఖబూస్ బిన్ సైద్ వచ్చేశారు. ఆ దేశ అధికారులంతా కంగారు పడిపోయారు. ప్రోటోకాల్ నిబంధనలు పక్కనపెట్టి రాజు గారు ఎయిర్ పోర్టుకి రావడం ఏంటని షాక్ అయ్యారు. తాము ఏమైనా తప్పు చేశామా అని అందరూ భయపడుతున్నారు. డాక్టర్ శంకర్ దయాళ్ శర్మను సాదరంగా స్వాగతించారు ఒమన్ రాజు. రాజు తన కారులో శంకర్ దయాళ్ శర్మను ఎక్కించుకుని, తానే డ్రైవ్ చేసుకుంటూ తీసుకెళ్లారు. ఏమీ అర్థంకాని ఒమన్ ఉన్నతాధికారులు.. ప్రోటోకాల్ ఇలా బ్రేక్ అవడంపై సీరియస్ అయ్యారు. ఒమన్ రాజభవనంలోకి చేరాక తెలిసింది ఏంటంటే ఒమన్ రాజు గతంలో పూణేలో చదువుకున్నారు. అప్పుడు ఆయనకు పాఠాలు చెప్పింది మన శంకర్ దయాళ్ శర్మ గారేనట. ఒమన్ రాజు తన గురువుకి ఇచ్చిన గౌరవం చూశారు కదా. దేవుడు, గురువు ఒకేసారి ఎదురుపడితే మొదట గురువుకే నమస్కారం చేస్తానన్నారు గురు కబీర్ దాస్. అది గురువుల గొప్పతనం.

**నాకు లైఫ్ టైమ్ గురువు చంద్రబాబు గారే :** దేశానికి అధినేత అయినా గురువు దగ్గర చదువుకున్న విద్యార్థే. వరల్డ్ రిచెస్ట్ పర్సన్ కూడా ఒక గురువుకు స్టూడెంటే. ఇంజనీర్, డాక్టర్, యాక్టర్, లీడర్, లాయర్... ఎవ్వరైనా ఓ గురువు వద్ద శిష్యుడే. సర్వేపల్లి రాధాకృష్ణన్ తనకు కృష్ణుడితో సమానమైన గురువు అని జాతిపిత మహాత్మా గాంధీ చెప్పారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే బాలికా విద్య కోసం ఎంతగానో కృషి చేసారు. నాకు లైఫ్ టైం గురువు మా నాన్న గారు చంద్రబాబు గారు. మిమ్మల్ని చూస్తుంటే నా టీచర్లు గుర్తొచ్చారు. వాళ్లు చెప్పిన పాఠాలు, కొట్టిన దెబ్బలు ఇంకా నాకు గుర్తున్నాయి. స్కూల్ లో మాది గోల బ్యాచ్... మేము ఫ్రెండ్స్ ఆఫ్ ఫస్ట్ బెంచర్స్. అంటే మాది లాస్ట్ బెంచ్. కానీ లాస్ట్ బెంచ్ నుండి స్టాన్‌ఫోర్డ్ కి నా ప్రయాణం ఎలా జరిగిందో మీకు చెబుతాను. స్కూల్ లో మంజులా మ్యాడం కొట్టిన దెబ్బలు, రమాదేవి మ్యాడం నేర్పిన డిసిప్లిన్ నాకు గుర్తున్నాయి. ఇంటర్ లో నారాయణ మాస్టారు బ్రిడ్జ్ కోర్సు. కార్నెగీ మెల్లన్ యూనివర్సిటీ లో ప్రొఫెసర్ రాజిరెడ్డి గారి డైరెక్షన్ నేను ఎప్పటికీ మర్చిపోలేను. ప్రపంచంలో ఏ రంగంలో ఉన్నవారైనా, ఎంత గొప్పవారైనా తమ టీచర్లను గౌరవిస్తూ ఉంటారని మంత్రి లోకేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, రాష్ట్ర మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)



పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా నున్నలో ఏర్పాటు చేసిన "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" వైద్య శిబిరాన్ని మంత్రి గురువారంనాడు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వికల్ క్యాన్సర్), ఇతర స్క్రీనింగ్ పరీక్షలను చేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు పరీక్షల ద్వారా అనుమానిత లక్షణాలున్నట్లు గుర్తించిన వారికి తదుపరి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఈ శిబిరాల ద్వారా మహిళలు, చిన్నారులు, బాలబాలికలకు కలిపి కోటిన్నర మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్వస్థ్ నారి అంటే ఆరోగ్యవంతమైన మహిళ అని, సశక్త్ పరివార్ అంటే ఒక శక్తివంతమైన కుటుంబంలో అత్యంత ముఖ్య భూమిక పోషించే మహిళ ఆరోగ్యవంతంగా ఉంటే ఆ కుటుంబం కూడా ఆరోగ్యవంతంగా, శక్తివంతంగా తయారవుతుందని మంత్రి వివరించారు.

**క్యాన్సర్ పరీక్షలు :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ప్రతి గ్రామంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ నోటి క్యాన్సర్ పరీక్షలు, 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికీ రొమ్ము క్యాన్సర్ పరీక్షలు, 30ఏళు నిండిన ప్రతి మహిళకీ సర్వైకల్ క్యాన్సర్ పరీక్షల్ని ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ ఆఫీసర్లు, సూపర్ స్పెషలిస్ట్ లు, స్పెషలిస్టులు, ఎఎన్ఎంలు దాదాపు 18 వేల మంది రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. 24 గంటలూ పనిచేసే శాఖ ఏదైనా ఉందా అంటే అది ఒక్క వైద్యారోగ్య శాఖే అని, చిత్తశుద్ధితో, నిబద్ధతతో పనిచేస్తున్న వైద్య సిబ్బందిని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

**ఎన్టీఆర్ అంతటివారు పండిట్ దీన్ దయాళ్ :** మాజీ సిఎం ఎన్టీ రామారావు గురించి గొప్పగా ఎలా మాట్లాడుకుంటామో.... ఉత్తరాదిలో ఏ రాష్ట్రానికెళ్లినా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గురించి అలా చెప్పుకుంటారని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కుటుంబం కన్నా దేశహితం ముఖ్యమని, దేశంలో ఉంటున్న కోట్లాది ప్రజల అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమని ఆయన భావించారన్నారు. ఈ దేశంలో ఆర్థిక సంస్కరణలు పేదవారిని దృష్టిలో పెట్టుకొని తీసుకురావాలని మొట్టమొదట చెప్పిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ దేశం కోసం పని చేయాలన్న ఉద్దేశంతో జీవితాంతం బ్రహ్మచారిగా ఉండిపోయారన్నారు.

## కంగ్రాట్స్ లోకేష్... 'మెగా డీఎస్సీ మెగా హిట్'

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా అభ్యర్థులు సీఎం, మంత్రి నారా లోకేష్ లకు కరచాలనం ఇచ్చేందుకు ఆసక్తి చూపారు. ఇక రొటీన్ సభ మాదిరిగా కాకుండా... ముఖాముఖి తరహాలో నిర్వహించారు. కొత్తగా నియమితులైన టీచర్లు ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి, బీజేపీ అధ్యక్షుణ్ణి కొన్ని ప్రశ్నలు వేశారు. వాటికి నేతలు ముగ్గురు ఆసక్తిగా సమాధానం ఇచ్చారు. సభ ప్రారంభంలో యువగళం పాట వేయడంపై మంత్రి లోకేష్ సభికులకు క్షమాపణ చెప్పడం.. అందర్నీ ఆశ్చర్యపరిచింది. మెగా డీఎస్సీ ఉత్సవ్ లో టీచర్ ఉద్యోగాలు సాధించిన వారి కష్టాలు,వారి నేపథ్యాలను ప్రత్యేకంగా వివరించేలా కార్యక్రమంలో వీడియోలను ప్రదర్శించారు. నిరుపేద, దిగువ మధ్యతరగతికి చెందిన యువత ఒక్కొక్కరు తమ కలల్ని ఎలా నిజం చేసుకున్నారనే అంశాన్ని వివరించేలా, స్ఫూర్తిని నింపేలా వీడియోలను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆ వీడియోలు చూసి పలువురు కంటతడి పెట్టారు.

**విద్యాశాఖకు సీఎం ప్రశంసలు :** మెగా డీఎస్సీ మెగా హిట్ కావడంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తో పాటు ఆ శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. టీచర్ల కరతాళ ధ్వనుల మధ్య భుజం తట్టి మంత్రి లోకేష్ ను వేదికపైనే అభినందించారు. మెగా డీఎస్సీ ప్రక్రియ ఆరంభం నుంచి నియామకాల వరకూ అధికారులు పడిన శ్రమను ప్రత్యేకంగా వేదికపైనే ప్రస్తావించిన మంత్రి లోకేష్ విద్యాశాఖ ఉన్నతాధికారులను అభినందించారు. ఈ తరహాలో ఉన్నతాధికారులను సభలో అభినందించడం తొలిసారి అనే చర్చ జరిగింది. ఉద్యోగాలు కల్పించి తమ జీవితాలను నిలబెట్టిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తో సెల్ఫీలు దిగేందుకు టీచర్లు పెద్ద ఎత్తున ఆసక్తి చూపారు. థ్యాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ ఉత్సవ్ కుహాజరైన మంత్రులు ఎమ్మెల్యేలు తమతమ జిల్లాలకు చెందిన టీచర్లతో కూర్చుని వారి సంతోషంలో భాగం అయ్యారు.

# సీఐ శంకరయ్యకు టికెట్ ఇస్తామని జగన్ ప్రలోభాలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : తాడేపల్లి ప్యాలెస్ నుంచి మాజీ సీఎం జగన్ ఆడిస్తున్న నాటకంలో సీఐ శంకరయ్య తన పాత్ర పోషిస్తున్నాడని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి గురువారం విమర్శించారు. ఎంపీ లేదా ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని శంకరయ్యను ఆయన ప్రలోభపెట్టడం వల్లే సీఎం చంద్రబాబుకు లీగల్ నోటీసులు ఇచ్చారన్నారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని.. తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి హెచ్చరించారు.
మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య రోజు పులివెందుల సీఐగా ఉన్న శంకరయ్య కేసును తారుమారు చేసేందుకు కుట్రపన్నారని.. అక్కడ ఉన్న నిందితులు సాక్ష్యాలను చెరిపేస్తుంటే వారికి సహకరించారని రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. సీఎంకు ఆయన నోటీసులు పంపడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. హైకోర్టును ప్రభావితం చేస్తూ నిందితులకు ప్రయోజనం చేకూర్చేలా కొత్త డ్రామాకు శంకరయ్య తెరలేపారని విమర్శించారు. నాడు ఆర్థికంగా లబ్ధి పొందడటంతో పాటు అన్ని సెటిల్‌మెంట్లు జరిగాకే వివేకా హత్య కేసు నిందితులకు ఆయన అనుకూలంగా మారారని ఆరోపించారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** రోడ్డు ప్రమాదంలో వైద్యుడు, ఆయన కుమార్తె మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం తాతపూడి వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది పోలీసుల కథనం ప్రకారం.. తిరుపతికి చెందిన వైద్యుడు తంగేళ్ల వెంకట కిషోర్(42), ఆయన కుమార్తె అశ్వినందన(7) సహా ఏడుగురు కుటుంబసభ్యులు కారులో తిరుపతి నుంచి గుంటూరు వైపు బయలుదేరారు. ఈక్రమంలో తాతపూడి వంతెన వద్ద వీరి వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.
ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న తంగేళ్ల వెంకట కిషోర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన కుమార్తె అశ్వినందన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మిగిలిన వారికి స్వల్ప గాయాలు కాగా.. చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితులు తెదేపా ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు బంధువులు కావడంతో.. ఆయన ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. మృతుడు వెంకట కిషోర్ తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య సంధ్య యాదవ్ కూడా ఉన్నారు.

# పోలీస్ స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీ



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్)**:నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ గురువారం శ్రీశైలం 1 టౌన్ పోలీస్ స్టేషన్, సుండిపెంట పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతను కాపాడాలని, రికార్డులు ఎల్లప్పుడూ అప్డేట్‌లో ఉంచాలని సూచించారు. రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదులు, ఇతర రికార్డులను పరిశీలించిన ఆయన బాధితులు నిర్భయంగా సమస్యలు చెబుతూ న్యాయం పొందే వాతావరణం కల్పించాలని, వారితో మర్యాదగా ప్రవర్తించాలని అధికారులకు ఆదేశించారు.
భక్తుల రాకపోకలు ఎల్లప్పుడూ అధికంగా ఉండే శ్రీశైలం ఆలయ పరిసర ప్రాంతాలు సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉండేలా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, పండుగలు, ఊరేగింపులు, ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లు స్థిరంగా ఉండాలని తెలిపారు. విశిష్ట వ్యక్తులు, అతి విశిష్ట వ్యక్తులు దర్శనాల సమయంలో ప్రోటోకాల్ పాటిస్తూ సరైన భద్రతా చర్యలు చేపట్టాలని కూడా ఆయన స్పష్టం చేశారు.
నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిరంతరం నిఘా సాగించాలని, పెండింగ్ కేసులపై వేగవంతంగా దర్యాప్తు జరిపి ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించాలన్నారు. స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, నేరచరిత్ర గలవారు, అనుమానితులపై కచ్చితమైన నిఘా ఉంచాలని సూచించారు. రోజువారీ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి గంజాయి, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్పీ ఆదేశించారు.
తరువాత ఎస్పీ సునీల్ షెరాన్ శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్, శ్రీశైలం 1 టౌన్ సీఐ జి. ప్రసాదరావు, సుండిపెంట సీఐ చంద్రబాబు పాల్గొన్నారు.

## పట్టువస్త్రాల సమర్పణ



**శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్)**:దసరా మహోత్సవాల సందర్భంగా విజయవాడ కనకదుర్గ అమ్మవారికి, దుర్గామల్లేశ్వరస్వామి వారికి శ్రీశైల దేవస్థానం తరుపున గురువారం పట్టువస్త్రాలను సమర్పించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
పట్టువస్త్రాల సమర్పణకు ముందుగా దుర్గామల్లేశ్వర ఆలయ ఈఓ శ్రీ శ్రీనానాయక్, ఆలయ సిబ్బంది శ్రీశైలం దేవస్థానం ప్రతినిధులను ఆహ్వానించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా మేళతాళాలతో పట్టువస్త్రాలను ఆలయంలో సమర్పించారు. ప్రతీ ఏటా దసరా సందర్భంగా ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి శ్రీశైల దేవస్థానం నుండి దుర్గామల్లేశ్వరస్వామివారికి పట్టువస్త్రాలను అందజేయడం జరుగుతుందని అధికారులు అన్నారు. ఇది రెండు దేవస్థానాల మధ్య ఉన్న అద్భుత సంప్రదాయబద్ధ అనుబంధానికి నిదర్శనమని పేర్కొన్నారు.
కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి యం. హరిదాసు, పర్యవేక్షకులు పి. ఉమేష్, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆక్వా రంగంపై అమెరికా పన్ను పోటు..!

- నష్టపోతున్న రైతులు
- దేశంలో అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రాకు దెబ్బ
- రొయ్యల దిగుమతుల వ్యతిరేకంగా అమెరికాలో బిల్లు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :రొయ్యల ఎగుమతిపై అమెరికా భారత్ కు మరో షాక్ ఇచ్చింది. ఇప్పటికే భారత్ పై ఎడాపెడా సుంకాల ఓటు వేస్తున్న అమెరికా మరో ఈసారి భారత్ నుంచి ఎగుమతి అవుతున్న సి ఫుడ్స్ పై మరో పంజా విసిరింది. ఇక అమెరికా విధిస్తున్న సుంకాలు భారత్ కు మింగుడు పడటం లేదు. తాజాగా ఆక్వా పై అమెరికా మరో షాకింగ్ నిర్ణయం తీసుకుంది. గత పది రోజులు క్రితం ఆక్వాపై 50 శాతానికి తగ్గకుండా సుంకాలు విధించిన అమెరికా దీనిపై మరోసారి తీసుకున్న నిర్ణయం ఇబ్బందిగా మారింది. కౌంటర్ వెయిటింగ్ డ్యూటీ కింద మరో 10 శాతం పనులు విధించి సుంకం మొత్తాన్ని 60 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తమౌతోంది. ఇరుదేశాల మధ్య ఉన్న వాణిజ్య విధానాన్ని దెబ్బతీసి అమెరికా ఏం సాధిస్తుందని వాణిజ్య నిపుణులు అంటున్నారు. గత రెండు రోజుల క్రితం అమెరికా తీసుకున్న మరో నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ఈ 60 శాతం సుంకం చాలదన్నట్లు మరో నిర్ణయం తీసుకొని అమెరికాలో నివాసం ఉంటున్న భారతీయులను దెబ్బకొట్టేలా వ్యూహం పన్నుతోంది. ఈసారి ఏకంగా భారత్ నుంచి రొయ్యల దిగుమతుల్ని నియంత్రించేలా అమెరికా చర్యలు ఉన్నాయంటున్నారు. భారత రొయ్యల సుంకం చట్టాన్ని (ఇండియా ష్రింప్ యాక్ట్) అక్కడి సెనేటర్లు బిల్ క్యాసిడీ, సిండీ హైడ్ స్మిత్ ప్రవేశపెట్టారు. ఇది అమెరికా భారత్ నుంచి రియల్ దిగుమతి చేసుకోకుండా అడ్డుకట్ట వేసే వ్యూహమని నిపుణులు చెబుతున్నారు.
లూసియానాలోని రొయ్యలు, క్యాట్‌ఫిష్ రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు బిల్లు తెస్తున్నట్లు సెనేటర్లు పేర్కొంటున్నారు. ట్రంప్ ట్రెజరీ శాఖ డిప్యూటీ అండర్ సెక్రటరీ నుంచి హామీ కూడా వారికి లభించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో క్యాసిడీ, ఆయన గ్రూప్.. భారత్, చైనా నుంచి అమెరికా మార్కెట్లోకి చౌక ఉత్పత్తులను అమెరికా విలువ చేసుకోకుండా నిరోధించేందుకు ప్రయత్నాలు ముమ్మరి వచ్చేసింది. అందులో భాగంగా ప్రయారిటైజింగ్ అఫెన్సివ్ అగ్రికల్చరల్ డిస్ప్యూట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్‌ను ప్రవేశపెట్టారు. దీనివల్ల అమెరికా ప్రజల ఎగువుతులపై విధించిన సుంకాలతో భారత్ లో. ఆక్వా రంగానికి కోలుకోలేని దెబ్బ తగులుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు
2023–24 గణాంకాలను పరిశీలిస్తే.. దేశం నుంచి ఎగుమతి అయ్యే మొత్తం సముద్ర ఆహార ఉత్పత్తుల్లో అమెరికా వాటా విలువ పరంగా 34.51%గా ఉంది. మొత్తం రూ. 60,524 కోట్ల ఎగుమతులు జరగ్గా.. రూ. 20,892 కోట్ల విలువైన ఉత్పత్తులు అమెరికాకు వెళ్లాయి
3,29,192 టన్నుల సముద్ర ఆహార ఉత్పత్తుల్ని అమెరికాకు పంపగా. అందులో రొయ్యలే దాదాపు 3 లక్షల టన్నులు ఉన్నట్లు అంచనా. అంటే 90.07% రొయ్యలే.
మొత్తం సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో ఏపీ వాటా 34% ఉన్నట్లు తెలుస్తోంది. ఏటా సుమారు రూ. 22,232 కోట్ల సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటివరకు పరిశీలిస్తే దేశవ్యాప్తంగా సముద్రపు ఉత్పత్తుల్లో పేరుగాంచిన రొయ్యలను ఎగుమతి చేసే దేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రముఖ స్థానాన్ని దక్కించుకుంది.
ఎల్2023–24లో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కాకినాడ, కృష్ణపట్నం పోర్టుల నుంచి సుమారు. రూ. 21,700 కోట్ల విలువైన 3.43 లక్షల టన్నులను ఎగుమతి చేశారు. ట్రంప్ సుంకాల విధింపు వల్ల ఆంధ్రప్రదేశ్ రొయ్యల పరిశ్రమకు సుమారు రూ. 27 వేల కోట్ల నుంచిరూ
29 వేలకోట్ల నష్టం జరిగి ఉంటుందని ఎగుమతుల నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు పోల్చుకుంటే దాదాపు
53% ఎగుమతి ఆర్డర్లు రద్దయ్యాయి. 2200 కంటెయినర్ల ద్వారా జరుగుతున్న ఎగుమతుల ద్వారా రూ. 589 కోట్ల మేర సుంకాల భారం పడిందని ఇటీవల కేంద్ర మంత్రులకు రాసిన లేఖలో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2.5 లక్షల రైతు కుటుంబాలతోపాటు ఈ రంగంపై సుమారు 30 లక్షల మంది ఆధారపడ్డారని వివరించారు.
50% ప్రతీకార సుంకాల భారం వల్ల భారత్ నుంచి అమెరికాకు రొయ్యల ఎగుమతులు భారీగా తగ్గినట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో ఈక్వెడార్ నుంచి అమెరికాకు గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది రొయ్యల ఎగుమతులు అధికమయ్యాయి వాణిజ్యవేత్తలు చెబుతున్నారు. ఆ దేశంపై అన్ని రకాల పన్నులూ కలిపి 13.78% మాత్రమే. 2024 ప్రథమార్థంతో పోలిస్తే 17% ఎగుమతులు పెరిగాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.
ఇండియా ష్రింప్ యాక్ట్ గురించి సమాచారం అందిందని.. స్పష్టత రావాల్సి ఉందని ఆక్వా రంగ నిపుణులు చెబుతున్నారు
సుంకాల భారంతో రాష్ట్రం తో పాటు భారత్ లో ఆక్వా రంగం కుదేలైందని నిపుణుల అభిప్రాయాన్ని బట్టి తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో తగిన విధంగా స్పందించి చర్యలు తీసుకోనట్లయితే భవిష్యత్తులో రాష్ట్రం తో పాటు రాష్ట్రంతో పాటు, దేశంలో ఆక్వా రంగం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పారిశుధ్య సమస్య తక్షణమె పరిష్కరించాలి





**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** పురపాలక సంఘ భవనం వెనుక నిర్మాణం చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్, దశాబ్దకాలంగా అపరిష్కృతంగా నిలిచిపోవడంతో,ఆ ప్రాంతం పారిశుధ్య సమస్యతో, దుర్వాసనమయంగా మారిన నేపథ్యంలో, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పురపాలక సంఘ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించి తగు సూచనలు చేశారు.
రామలింగేశ్వరపేట లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి గురువారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా పురపాలక సంఘ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయం వెనుక అపరిష్కృతంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ భవన సముదాయాన్ని పురపాలక సంఘ అధికారులతో కలిసి పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిన ఆ ప్రాంతంలో, పారిశుధ్య సమస్య తాండవిస్తోంది. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల క్రమంలో కూటమి ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రతకు ఇస్తున్న ప్రాధాన్యత వివరిస్తూ, ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పురపాలక సంఘాలలోని, పట్టణాల పరిశుభ్రతకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. పెరుగుతున్న వర్షాలతొ, కలరా, డయేరియా వంటి వ్యాధులు కొన్ని చోట్ల వెలుగు చూశాయన్నారు.
షాపింగ్ కాంప్లెక్స్ పరిసరాల్లో శానిటేషన్ సమస్య మరింత జఠిలం కాకుండా, కొత్త సమస్యలు తలెత్తకుండా,
అధికారులు చర్యలు చేపట్టాలని కోరామని తెలిపారు. వారంలోగా పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపుతామని అధికారులు తెలిపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కౌన్సిలర్లు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 21 మినరల్ వాటర్ ప్లాంట్లు సీజ్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : నగరంలో కలుషిత త్రాగు నీటిని సరఫరా చేస్తున్నట్లు గుర్తించిన 21 మినరల్ వాటర్ ప్లాంట్లను సీజ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజారోగ్యం దృష్ట్యా వైద్యారోగ్య శాఖ సూచనల మేరకు సీజ్ చేయుట జరిగిందని చెప్పారు. నగరంలో కొన్ని ప్రాంతాలలో కలుషిత త్రాగు నీరు, ఆహారం వలన డయేరియా కేసులు నమోదౌతున్న నేపథ్యంలో నగరంలో ఉన్న 120 మినరల్ వాటర్ ప్లాంట్లు సరఫరా చేయు త్రాగు నీటి శాంపిల్స్ ను మంగళగిరిలోని ఐ.పి.యం పి. హెచ్ ల్యాబ్, గుంటూరు మెడికల్ కాలేజీ ఆవరణలోని రీజినల్ పి. హెచ్ లాబరేటరీలో పరీక్షించగా అందులో 21 ప్లాంట్ల నుండి విక్రయించే నీటిలో హానికారక బ్యాక్టీరియాను గుర్తించడం జరిగిందన్నారు. ల్యాబ్ ల నివేదిక ప్రభుత్వానికి పంపారని, ప్రభుత్వం తక్షణమే ప్రజారోగ్యానికి భంగం కలిగించే హానికారిక బ్యాక్టీరియాలను కలిగి ఉన్న నీటిని విక్రయిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లను వెంటనే సీజ్ చేయాలని జిల్లా ఆదేశించడం జరిగిందన్నారు. నగరంలో ఐ.పి.డి కాలనీలోని పెరల్స్ ఎంటర్ ప్రైజెస్, నల్లచెరువులోని నీల్ డ్రాప్, శ్రీనివసరావుతోట 60 అడుగుల రోడ్డు లోని మై ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్, చరణ్ వాటర్ ప్లాంట్, రెడ్ల బజార్ లోని కే.పి రావు ప్లాంట్, అంబేద్కర్ నగర్ లోని జే.యస్. వాటర్ ప్లాంట్, పాత గుంటూర్ బాలాజీ నగర్ లోని ఏకా వారి వీధి వాటర్ ప్లాంట్, మల్లిఖార్జున పేట లోని గురుశ్రీ మినరల్ వాటర్ ప్లాంట్, ఏ.టి అగ్రహారం లోని బాషా కూల్ డ్రింక్, శివనగారాజు కాలనీలోని వాసవి వాటర్ ప్లాంట్, నెహ్రూ నగర్ లోని ఆర్.కే వాటర్ ప్లాంట్, నగరాలలోని స్వాతి అండ్ ఫుడ్ వాటర్ ప్లాంట్, స్తంబాలగరువులోని ఎలైన్ ఫ్రెష్ వాటర్, మద్దిరాల కాలనీలోని పరమేష్ హోల్ సేల్, సంపత్ నగర్ లోని నరేష్ షాప్, కొబాల్డ్ పేట లోని ఉమర్ బాషా ఫ్లేవర్డ్ వాటర్, పలకరూరులోని యన్.టి.ఆర్ సుజల ప్లాంట్, హిమని నగర్ లోని సరస్వతి కృష్ణ స్టోర్, బుడంపాడులోని స్టైన్ లెస్ స్టీల్ స్టోరేజ్ ట్యాంక్, ఏటుకూరు లోని మేఘన షాప్, లాల్పురం రోడ్డులోని 76వ సచివాలయం దగ్గరలోని ప్లాంట్లను నగర పాలక సంస్థ ప్రజారోగ్య శాఖ ద్వారా సీజ్ చేసినట్లు చెప్పారు. ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

# శిష్టరక్షణే... పరమాదిగా అమ్మకు అలంకార అర్చనలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** అమ్మవారి అవతారాల అలంకరణ పరంపరలో మూలసూత్రం, దుష్టశిక్షణ, శిష్టరక్షణ ఆ దిశగా,దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష అలంకారములతో ప్రత్యేక పూజలతో కొనసాగుతున్నాయి. అమ్మ దర్శనం కోసం విశేషంగా భక్తులు ఆలయాలకు తరలివస్తున్నారు.
దసరా మహోత్సవాలలొ గురువారం అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూల కుటమ్మ, పలు దేవాలయాలలో విశేష అలంకార పూజలతో భక్తులను అలరించారు.
దేవి గుడి సెంటర్ శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో,సంతాన లక్ష్మిగా అమ్మవారు పూజలందుకున్నారు. 94వ శరన్నవరాత్రి ఉత్సవాలు విశేషకుంకుమార్చనలతో, శ్రీ చక్రార్చన పూజలతో కన్నుల పండుగ కొనసాగుతున్నాయి. ఆలయ పాలకమండలి కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. గంగానమ్మపేటలోని రజకచెరువు వద్ద గల కామాక్షి అమ్మవారి ఆలయంలో కాత్యాయనీ దేవిగా అమ్మవారు పూజలు అందుకున్నారు. బోస్ రోడ్ లో వేంచేసి యున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీ వాసవి మాత శ్రీ లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు మంగళ గౌరీగా పూజలు అందుకున్నారు. ఆలయ అర్చక స్వామి రామకోటేశ్వర శర్మ అలంకార పూజలు నిర్వహించారు.
మారీస్ పేటలో వేంచేసియున్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయంలో, దసరా మహోత్సవాలు కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి. అమ్మవారు అన్నపూర్ణాదేవిగా పూజలు అందుకున్నారు. బుర్రిపాలెం రోడ్ లోని కాళీమాత ఆలయం సెంటర్లో దసరా మహోత్సవాలు సందర్భంగా అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరిగా పూజలు అందుకున్నారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారికి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
నాలుగవ రోజుకు చేరుకున్న దసరా మహోత్సవాలలో నిత్యము సాయంత్ర వేళల్లో ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా,ఆలయాలు భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక ఆనందానికి వేదికలుగా, విశేష విద్యుత్ దీప అలంకారములతొ వెలుగొందుతున్నాయి.

# సీఎంపై వైకాపా ఎమ్మెల్సీ వ్యాఖ్యలు..



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో,(జర్నలిస్ట్ ఫైల్):** సూపర్ సిక్స్‌పై స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఏపీ శాసన మండలిలో గురువారం.తీవ్ర గందరగోళం నెలకొంది. హామీలు అమలు చేయకుండానే సూపర్ హిట్ అంటూ కూటమి సర్కారు మోసగిస్తోందని వైకాపా సభ్యుడు రమేశ్ యాదవ్ ఆరోపించగా మంత్రులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. హామీల అమలును జీర్ణించుకోలేకే వైకాపా నేతలు కడుపుమంటతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సుదీర్ఘ కాలం సీఎంగా పనిచేసిన చంద్రబాబును కుప్పం ఎమ్మెల్యే అంటూ సంబోధించిన వైకాపా ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
వైకాపా సభ్యుడు సీఎంను కుప్పం ఎమ్మెల్యే అని మాట్లాడారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రికార్డులను పరిశీలించి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం ను అగౌరవపరిచినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం సభా నాయకుడు.. ఆ విషయాన్ని వైకాపా సభ్యుడు ఎలా మర్చిపోతారని మంత్రి నాదెండ్ల మనోహర్ నిలదీశారు.
సభలో పరిణామాలు సభా సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్నాయని మండలి ఛైర్మన్ మోషేనురాజు అన్నారు. జరిగిన పరిణామాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. సభ్యుడు రమేశ్ యాదవ్ మాటలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. ఆయన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామన్నారు. పెద్దల సభలో సభ్యులు హుందాగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌పై లఘు చర్చను రేపటికి వాయిదా వేశారు. రేపు వ్యవసాయంతో పాటు సూపర్ సిక్స్ అంశాలు చర్చించాలని నిర్ణయించారు.

## మున్సిపల్ శాఖలో ఐదు బిల్లులకు ఆమోదం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : పట్టణాభివృద్ధిశాఖకు సంబంధించి ఐదు బిల్లులను ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. దీనిలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్‌చట్ట సవరణ 2025తోపాటు మరో నాలుగు సవరణలను మంత్రి నారాయణ అసెంబ్లీలో ప్రతిపాదించారు. వీటన్నిటికీ సభ ఆమోదం తెలిపింది. వీటిల్లో నాలా చట్టం రద్దుతో మున్సిపాలిటీలు అదనపు అభివృద్ధి ఛార్జీల వసూలుకు సంబంధించిన అంశాన్ని ఆమోదించారు. అలాగే బహుళ అంతస్తుల భవనాలను ఇప్పటి వరకూ 18 మీటర్ల ఎత్తుకు నిర్మిస్తుండగా దాన్ని 24 మీటర్ల ఎత్తుకు పెంచుతూ పెట్టిన బిల్లు ఆమోదం పొందింది. అలాగే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు సంబంధించి బిపిఎస్ బిల్లునూ ఆమోదించారు. ఎపిలో పట్టణాల్లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు గతంలో జనవరి ఒకటోతేదీ గడువుగా ఉండేది. ఒకపై ఏప్రిల్, జులై, అక్టోబర్లోనూ నమోదు చేసుకునేలా అవకాశం కల్పించారు. వైఎస్‌ఆర్ తాడిగడప మున్సిపాలిటీ పేరును తాడిగడప మున్సిపాలిటీగా మార్చారు. దీనిపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు మాట్లాడారు. ప్రభుత్వ భూములను రెగ్యులరైజ్ చేయాలని విశాఖ వెస్ట్ ఎమ్మెల్యే గణబాబు కోరారు. బిపిఎస్ వల్ల భవనాలకు చాలా వరకూ న్యాయం జరుగుతుందని అన్నారు. అలాగే లిఫ్టుఫ్లోర్, వాటర్ ట్యాంకు, సూర్యఫుర్‌కు మినహాయింపు ఇవ్వాలని కోరారు. జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇష్టం వచ్చినట్లు భవనాలు నిర్మించారని దానివల్ల యజమానులు ఇబ్బందుల పడుతున్నారని, ఇప్పటి వరకూ ఉన్న చిక్కుముడలన్నీ ఎత్తేసి భవనాలకు రెగ్యులరైజ్ చేయాలని కోరారు. బోడే ప్రసాదు మాట్లాడుతూ తాడిగడపలో ప్రతి నెలా రెండు కోట్ల రూపాయలు ఖర్చవుతోందని అన్నారు. ఏడాది కాలం నుండి మున్సిపాలిటీలో ఉన్న శానిటేషన్ వాహనాలకు పెట్రోలు బిల్లులు కూడా ఇవ్వడం లేదని తెలిపారు.

## సర్వసభ్య సమావేశానికి స్పందన కరువు



**మైదుకూరు జర్నలిస్ట్ ఫైల్ :** మైదుకూర్ మున్సిపాలిటీలో ప్రజా సమస్యలు అభివృద్ధిపై చర్చించాల్సిన కౌన్సిలర్లు హాజరు కాకపోవడం పై ప్రజల్లో తీవ్ర చర్చగా మారింది. సమావేశానికి కోరం 12 మంది కౌన్సిలర్ రావాల్సి ఉండగా టిడిపికి చెందిన ఒకరు వైసీపీకి చెందిన నలుగురు వారితో పాటు మున్సిపల్ చైర్మన్ హాజరయ్యారు మరి కొన్ని నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు ప్రజా సమస్యల తీర్చి ఓట్లు అడగాల్సిన కౌన్సిలర్లు గైర్హాజరు పై మైదుకూరు పట్టణ ప్రజల్లో తీవ్ర చర్చకు గురిచేసింది సమావేశానికి వచ్చిన సభ్యులతో
ఇటీవల మరణించిన ఐదవ వార్డు కౌన్సిలర్ ఖాదర్ భాషకు చైర్మన్ కౌన్సిలర్లు నివాళులు అర్పించిడం జరిగింది. సమావేశం వాయిదా విషయంపై మైదుకూరు శాసనసభ్యులు ఎలా స్పందిస్తారో చూడాలి. అని ప్రజలు చర్చించుకుంటున్నారు.



## శ్రీకాళహస్తి దేవస్థానం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పణ

**విజయవాడ, సెప్టెంబర్ 25(జర్నలిస్ట్‌ఫైల్):**

అన్నపూర్ణ దేవిగా దర్శనమిస్తున్న దుర్గా అమ్మవారికి శ్రీకాళహస్తి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలను, సారెను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ కుమార్ రెడ్డి, శ్రీకాళహస్తి దేవస్థాన ఈవో టి. బాపిరెడ్డి సమర్పించారు. శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర ఆలయం నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించడం ఆనవాయితీ అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ కు మార్ రెడ్డి తెలిపారు. వేద పండితులు, మహిళలతో కలిసి పట్టు వస్త్రాలు, సారె సమర్పించడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండి, అభివృద్ధి పథంలో సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా విఐపి లు నిర్దేశిత సమయంలోనే దర్శనం చేసుకోవాలని సూచించారు.

## శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు బాగున్నాయి

- జగన్మాతను దర్శించుకున్న రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు



**విజయవాడ, సెప్టెంబర్ 25(జర్నలిస్ట్‌ఫైల్):**

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ రామచంద్ర మోహన్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ నేతృత్వంలో నవరాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లు చాలా బాగా చేశారని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురాం కృష్ణరాజు అన్నారు. బుధవారం ఆయన శ్రీ అన్నపూర్ణాదేవి అలంకృత జగన్మాతను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను వేద పండితులు అందజేశారు. ఆయనతోపాటు చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ కూడా జగన్మాతను దర్శించుకున్నారు.

## అమ్మవారి సేవలో కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్



**విజయవాడ, సెప్టెంబర్ 25(జర్నలిస్ట్‌ఫైల్):**

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారిని రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి షెకావత్ మాట్లాడుతూ... దసరా నవరాత్రులలో అమ్మవారి దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా తరలివస్తున్న భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. మొదటిసారి జరుగుతున్న "విజయవాడ ఉత్సవ్" కు హాజరయ్యానని, అద్భుతంగా జరుగుతున్న ఈ ఉత్సవ్ ను చూస్తే ఇది మొదటి సారి అని నమ్మలేమని చెప్పారు. ఇది ప్రజల ఉత్సవంగా జరుగుతోందన్నారు. 2047 నాటికి మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చూడాలన్న ప్రధాని మోదీ కల అమ్మవారి ఆశీస్సులతో సాకారం కావాలని ఆకాంక్షించారు.

## దసరా ఉత్సవాల కోసం 3 లక్షల విరాళం

- మంత్రి కొలుసు పార్థసారథి తనయుడు, టీడీపీ యువనాయకుడు కొలుసు నితిన్ కృష్ణ



**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 25(జర్నలిస్ట్‌ఫైల్):**

నూజివీడు పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ కోట మహిషాసురమర్ధిని అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తనయుడు, నితిన్ సాయి కన్స్ట్రక్షన్ అధినేత కొలుసు నితిన్ కృష్ణ కి ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితులు సత్కారం చేశారు.మంత్రి ఆదేశాలతో దసరా ఉత్సవాల నిమిత్తం రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి. పాడిపంటలు పుష్కలంగా పండి ప్రజలందరూ ఆనందంగా ఉండాలి. మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం మంచి పరిపాలన పొందాలని అన్నారు.

# నిరంతరం భక్తుల్లోనే..





- భక్తులతో మమేకమవుతూ ఏర్పాట్లపై అభిప్రాయాలు తెలుసుకుంటూ
- సమస్య ఏదైనా ఉంటే అక్కడికక్కడే సరిదిద్దుతూ
- భక్తుల మన్ననలు పొందుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ, సెప్టెంబర్ 25(జర్నలిస్ట్‌ఫైల్):**

దసరా మహోత్సవాలకు చేసిన ఏర్పాట్లు బాగున్నాయా.. మీకు ఏమైనా ఇబ్బంది ఉందా.. ఇలా భక్తులతో మాట్లాడుతూ.. ఏవైనా సమస్యలు ఉంటే అకడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చి సరిదిద్దుతూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ముందుకు సాగుతున్నారు .అప్పుడు ఇప్పుడు అని కాదు. ఆ ప్రాంతం ఈ ప్రాంతం అని కాదు.. ప్రతిచోటకు చురుగ్గా కదులుతూ క్యూ లైన్ లలో సైతం భక్తులతో కలసి అడుగులు వేస్తూ ఏర్పాట్లపై అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. సమస్యలు ఏవైనా అక్కడికి అక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిఒక్కరికి సంతృప్తి కరంగా అమ్మను దర్శించుకునేలా దిశా నిర్దేశం చేస్తున్నారు. 11 రోజులపాటు కొనసాగే శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అక్కడికక్కడే... అప్పటికప్పుడే... శాశ్వత పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న చర్యలను భక్తులు ప్రశంసిస్తున్నారు. ప్రధానంగా దర్శనం కోసం భక్తులు వేచి చూచే సమయం తగ్గించడం... దర్శనానంతరం... లడ్డు ప్రసాదాల.. విక్రయ కేంద్రాల వద్ద రద్దీని నివారించడం... అన్న ప్రసాదం నిర్వహించే కేంద్రాలలో ఎటువంటి సమస్యలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. 36 సెక్టార్లలో వందల మంది సిబ్బంది మధ్య సమన్వయం సాధించి మహోత్కృష్టమైన రాష్ట్ర పండుగను అమ్మవారిని దర్శించుకున్న ప్రతి ఒక్కరూ ఏడాది పొడవునా గుర్తుంచుకునేలా నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న చర్యలను ప్రతి భక్తుడు అభినందించడం విశేషం.

### పలు విజ్ఞప్తుల మేరకు

# విఐపి దర్శన వేళల్లో మార్పులు



- కేటాయించిన సమయాల్లో వీఐపిలు అమ్మవారిదర్శనం చేసుకోవాలి
- మూడవరోజు సాయంత్రానికి 31 లక్షల ఆదాయం
- దుర్గగుడి ఈవో శీనా నాయక్

**విజయవాడ, సెప్టెంబర్ 25(జర్నలిస్ట్‌ఫైల్):**

అమ్మవారిని దర్శించుకునేందుకు దేవస్థానానికి విచ్చేయుచున్న వివిఐపీలు, వీఐపీలు వారికి కేటాయించిన సమయాల్లోనే అమ్మవారిని దర్శించుకోవాలని దుర్గగుడి ఈవో శీనా నాయక్ విజ్ఞప్తి చేశారు.బుధవారం జరిగిన కార్యక్రమాలపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రతి రోజు ఉదయం 7 నుండి 9 వరకు, సాయంత్రం 3 నుండి 5 వరకు ప్రోటోకాల్ దర్శనం ఉండగా,సెప్టెంబర్ 25 గురువారం నుండి... 1. ఉదయం 5 గంటల నుండి 6 గంటల వరకు 2. ?మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు 3. ?సాయంత్రం 8 గంటల నుండి 9 గంటల వరకు ప్రోటోకాల్ పరధి లోకి వచ్చే ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ వ్యవస్థలకు చెందిన వారికి శ్రీ కనక దుర్గ అమ్మవారి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా సమయాల్లో వచ్చిన వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేస్తామని చేస్తామనితెలిపారు. ఇతర సమయాల్లో వచ్చే విఐపి లకు ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేయ డం సాధ్యం కాదన్నారు. సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా వీఐపీలు సహకరించాలని కోరారు. దసరా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయన్నారు. మూడవ రోజు సాయంత్రం 5 గంటలకు 58,087మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు చెప్పారు. రాత్రి గం. 11 వంకు అమ్మవారినీ దర్శించుకునే అవకాశం ఉన్నం దున ఈ సంఖ్య మరింత పెరగవచ్చని తెలిపారు. చిన్నారులు తప్పిపోకుండా 5,592ట్యాగ్ లు చిన్నపిల్ల లకు వేశామన్నారు. 22,506 మందికి అన్న ప్రసాదం అందించామన్నారు.సాయంత్రానికి 31 లక్షల ఆదాయం దసరా ఉత్సవాలలో మూడవ రోజు సాయంత్ర సమయానికి పలు రకాల సేవలు, దర్శన టికెట్ల విక్రయ రూపేణా రూ. 31లక్షల 8 వేల 635 రూపా యల ఆదాయం వచ్చిందన్నారు. మూడు వందల రూపాయలు టిక్కెట్లు 3,521 విక్రయించగా 10,56, 300 రూపాయలు, వంద రూపాయల టిక్కెట్లు 3,464 విక్రయించగా 3,46,400 రూపాయలు, 15 రూపా యల లడ్డులు 19,924 విక్రయించగా 2లక్షల 98 వేల 860 రూపాయలు, వందరూపాయల లడ్డు బాక్స్ లు 11, 898 విక్రయించగా 11,89,800 రూపా యల ఆదాయం వచ్చిందన్నారు. ఇది కాకుండా పరోక్షంగా జరిగిన ప్రత్యేక కుంకుమార్చనల ద్వారా లక్ష 38 వేలు, అదే విధంగా ప్రత్యేక ఖడ్గమాలార్చన ద్వారా రూ.25, 580 ఫోటో& క్యాలెండర్ల విక్రయం ద్వారా 3,850 రూపాయలు, కేశఖండన ద్వారా రూ.39, 520, ఇతర త్రా 10,325 రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు.

### రాష్ట్ర వ్యాప్తంగా

# జర్నలిస్టులందరికీ వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించండి

- ప్రెస్ అకాడమీ చైర్మన్ కోరిన ఏపీజేఎఫ్
- జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రితో చర్చించండి
- జర్నలిస్టులకు ప్రమాద బీమా తో పాటు సహజ మరణానికి కూడా ఇన్సూరెన్స్ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్రంలో జర్నలిస్టులందరకు ఇళ్ల స్థలాలు, ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సహకారం ఇప్పించాలి



**విజయవాడ, సెప్టెంబర్ 25(జర్నలిస్ట్‌ఫైల్):**

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడానికి సహకరించాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌ను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పి.శివ రాజేష్ కోరారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు జర్నలిస్టు లు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నా రని, వాటిని మార్చి గత ప్రభుత్వానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను మరల తిరిగి పునరుద్ధించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాజేష్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ను కోరారు. జర్నలిస్టులకు గతంలో 10 లక్షల ప్రమాద బీమా వర్తించే విధంగా 2019 కు ముందు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అయితే ఆ సమయంలో దాదాపు పదుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం జర్నలిస్టులకు ప్రమాద బీమాను ఇప్పించే విధంగా బాధ్యత తీసుకుందని, అయితే గత ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పిర్ల. శివ రాజేష్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కు వివరించారు. గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఎటు వంటి ప్రయోజనకరమైన కార్యక్ర మాలు చేయలేదని, ఈ ప్రభుత్వంలో జర్నలిస్టుల కు ప్రయోజనకరమైన అన్ని స్కీములు పునర్థించి, అమలు అయ్యే విధంగా ప్రభుత్వానికి అకాడమీ చైర్మన్ గా సూ చించాలని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ నాయ కులు కోరారు.ఆంధ్రప్రదేశ్ లో జర్నలిస్టులకు శిక్షణ తరగ తులు అన్ని ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు అవకాశం ఇవ్వాలని, అందులో భాగంగా మొదటగా విజయవాడ కేంద్రంగా నిర్వహించే విధంగా ప్రెస్ అకాడమీ సహకరి ంచాలని కోరడంతో చైర్మన్ సురేష్ దానికి అంగీకారం తెలిపారు. త్వరలోనే ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో శిక్షణ తరగతులకు సంబంధించి తేదీలను తెలియ జేస్తామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా చూడాలని ఏపీజేఎఫ్ నాయకులు ఆయన ను కోరారు. జర్నలిస్టులకు ప్రమాద బీమా తో పాటు సహజ మరణానికి కూడా ఇన్సూరెన్స్ వర్తించే విధంగా చర్యలు తీసుకుంటే వందలాదిమంది జర్నలిస్టుల కుటుంబాలకు భరోసాగా, చాలా ప్రయోజనకరంగా ఉంటుందనీ ఏపీజఎఫ్ నాయకులు ఆయన ను కోరడంతో ఆయన స్పందించి ఖచ్చితంగా జర్నలిస్ట్ ప్రమాద భీమా ను అత్యవసరంగా మరల అందుబాటులోకి తీసుకువచ్చి దానితోపాటు సహజ మరణానికి కూడా ఇన్సూరెన్స్ వర్తించే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పాటు సమానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా సీనియర్ జర్నలిస్టులకు 15,000 రూపాయలు పెన్షన్ వచ్చే విధంగా చట్టాన్ని రూపొందించాలని, దేశంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు దశాబ్ద కాలంగా ఆ పథకాన్ని అమలు చేస్తున్నాయని అదే తరహాలో సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ స్కీమును అందుబాటులో తెచ్చేందుకు ప్రయత్నించాలని కోరగా వారు కచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు.ప్రెస్ అకాడమీ చైర్మన్ గా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ లు ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన ఏపీజేఎఫ్ నాయకులకు హామీ ఇచ్చారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కలిసిన వారిలో ఏపీజేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బ్రహ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి యేమినేని వెంకట రమణ రమణ, గుంటూరు జిల్లా ఏపీజేఎఫ్ నాయకులు సుభాష్, ఏపీజేఎఫ్ నాయకులు పసుపులేటి చైతన్య, తదితరులు పాల్గొన్నారు. అంతముందు ఏపీజేఎఫ్ నాయకులు సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొంది, ప్రెస్ అకాడమీ లో బాధ్యతలు వహిస్తున్న భావనారాయణ ను సత్కరించారు.

# బల్వంత్‌ను ఇంకా ఎందుకు ఉరితీయలేదు?



## పంజాబ్ మాజీ సిఎం హత్యకేసు విచారణలో ప్రశ్నించిన సుప్రీం

### తన మరణశిక్షను జీవితఖైదుగా మార్చాలన్న బబ్బర్ ఖల్సా ఉగ్రవాది

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** పంజాబ్‌ముఖ్యమంత్రి బియాంత్‌సింగ్ హత్యకేసులో నిందితుడిగా ఉన్న బబ్బర్‌ఖల్సా ఉగ్రవాది బల్వంత్‌సింగ్ రాజోనాపై ఉన్న మరణశిక్షను ఇప్పటివరకూ ఎందుకు అమలుచేయలేదని కారణాలను ప్రశ్నించింది. రాజోనా దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణకు స్వీకరించింది. ఆయనపైఉన్న మరణశిక్షను జీవిత ఖైదుగా మార్చాలంటూ దాఖలుచేసిన పిటిషన్‌ను బుధవారం విచారణకు స్వీకరించింది. తన క్షమాబిక్ష పిటిషన్ రాష్ట్రపతి వద్ద 2012 నుంచి ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందని అందు వల్ల తన మరణశిక్షను రద్దుచేయాలంటూ అభ్యర్థించారు. పంజాబ్ పోలీస్ అధికారి అయిన బల్వంత్‌సింగ్ రాజోనా 2007లో ఆయనకు మరణశిక్ష విధించింది.

ఆయనపై ఐపిసి 120బి, 302, 307, 1860 ఐపిసిపరిధిలోను, ఆయుధ చట్టం 1908లోని సెక్షన్స్ 3(బి), 4(బి) 5(బి) రెడ్‌విత్ 6సెక్షన్లకింద కేసులు నమోదు చేసారు. చండీఘర్ సెక్రటేరియట్ కాంప్లెక్స్‌లో 1995 ఆగస్టు 31వ తేదీ ఆత్మాహుతి బాంబు దాడికి పాల్పడ్డారని, ఆ దాడిలోనేనాటి పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్‌తోపాటు మరో 16 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సిబిఐ ఛార్జిషీటు దాఖలుచేసింది. ఈకేసులో బుధవారం సింగ్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తన వాదనలు వినిపించారు. జస్టిస్ విక్రమ్‌నాథ్; జస్టిస్ సందీప్‌మెహతా, జస్టిస్ ఎన్‌వీ అంజారి యాల బెంచ్‌పై రాజోనా పిటిషన్‌ను విచారిం చారు. రాజోనాను ఇప్పటికే 29 ఏళ్లకుపైబడి జైలులో ఉంచారని, 15 ఏళ్లగా ఆయ ఇప్పటికీ మరణశిక్ష ఖైదీగానే ఉన్నారని, ఆయన తరపున సిక్ గురుద్వారా కమిటీ పిటిషన్ దాఖలుచేసిందని అన్నారు. ఇప్పటికే చాలా ఆలశ్యం అయిందని, సత్వరమే ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సుప్రీం కోర్టులోనే రెండున్నరేళ్లక్రితం న్యాయ మూర్తులు చెప్పిన అంశాన్ని గుర్తుచేసారు.

తన పిటిషన్ ముందుకు సాగకపోవడంపై 2024లో మరో పిటిషన్ దాఖలుచేసారని చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ కేంద్రానికి ఒక చిట్టచివరి అవకాశం ఇచ్చి క్షమా బిక్ష పిటిషన్‌ను సత్వరమే పరిశీలించాలని ఆదే శించింది. ఇప్పటికీ కూడా కేంద్రం స్పందించలే దని, అందువల్ల కోర్టు మాత్రమే ఈ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు. ప్రభుత్వం తరపున హాజరయిన అదనపు సొలిసిటర్ జనరల్ కెఎం నటరాజ్ కేంద్రం తరపున పిటిషన్ దాఖలుచేసేందుకు కొంత వ్యవధి కావాలనికోరారు. ప్రస్తుత స్థితినివేదికను తెలియ జేస్తామని కోరగా రోహత్గి మాట్లాడుతూ ఇప్పటికే ఎనిమిదినెలలు గడిచిందని ఏంజరుగుతుందో కూడా ఎవరికి తెలియడంలేదని అన్నారు.

గతంలో భుల్లార్‌పై నమోదయినకేసులో విధించిన మరణ శిక్షను సుప్రీంకోర్టు జీవిత ఖైదుగా మారిందని, ప్రస్తుత పిటిషనర్‌గడచిన 30ఏళ్లగా జైలు లోనే ఉన్నారని వాదించారు. ఈ పిటిషన్ విచారణ లోనే జస్టిస్ మెహతా మాట్లాడుతూ ఆయన మరణశిక్షను ఇప్పటివరకూ ఎందుకు అమలుచేయ లేదని, ఎవరిని ఇందుకు బాధ్యులను చేయాలని ప్రశ్నించారు.కనీసం సుప్రీం కోర్టుకూడా బల్వంత్ సింగ్ మరణశిక్షను వాయిదా వేయలేదని గుర్తు చేసారు. పిటిషన్‌పై తదుపరి విచారణ వచ్చేనెల 15నజరుగుతుందని ఆలోపు కేంద్రం వివరణ ఇవ్వాలని న్యాయ మూర్తులు ఆదేశించారు.



# భారత్ మావైపే నిలుస్తోంది!

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**క్యీవ్,సెప్టెంబరు 25:** ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న దాడికి భారత్ నిధులు సమకూరుస్తోందంటూ అమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. ఇలాంటి తరుణంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తమవైపే ఉందని తాజాగా మీడియా ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునే అంశంలో మోడీ ప్రభుత్వం మనసు మార్చుకుంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. రష్యాతో భారత్ చేసుకున్న ఒప్పందం మాకు సమస్యగా మారింది. కానీ, దీనిని ట్రంప్ పరిష్కరించ గలరని అనుకుంటున్నా. భారత్ తరహాలో చైనా మాకు మద్దతిస్తుందని నేను అనుకోను. ఎందుకంటే ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధాన్ని ఆపెయ్యడం వల్ల తమకు కలిగే ప్రయోజనం ఏదీ లేదని చైనా అనుకుంటోంది. అయినప్పటికీ ట్రంప్ తలచుకుంటే జిన్‌పింగ్ వైఖరిని కూడా మార్చగలరని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ ఆదాయం సమకూరుస్తున్న దేశాలపై సుంకాలు విధించడం సరైన నిర్ణయమేనని గతంలో జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. తాజాగా భారత్ విషయంలో ఆయన తన వైఖరిని మార్చుకున్నట్టు అర్థమవుతోంది. అయితే తాజాగా న్యూయార్క్‌లో జరిగిన ఐక్య రాజ్యసమితి ప్రతినిధుల సమావేశంలో ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలు ఉక్రెయిన్ యుద్ధానికి మద్దతుగా నిలుస్తున్నాయన్నారు. అలాగే నాటో దేశాలుకూడా రష్యానుంచి చమురు కొనడాన్ని తగ్గించడం లేదని విమర్శించారు.

# లడఖ్‌లో వాంగ్‌ఛుక్ దీక్ష విరమణ

### శాంతియుత ఆందోళన ఒక్కటే మార్గమని యువతకు పిలుపు

**లేహ్, సెప్టెంబరు 25:** లడఖ్‌కు రాష్ట్రహోదా ఇవ్వాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో చేర్చాలని కేంద్రాన్ని డిమాండ్‌చేస్తూ గడచిన 15 రోజులుగా నిరవధిక దీక్ష చేపట్టిన పర్యావరణ హక్కుల పరిరక్షణ నేత సోనమ్‌వాంగ్‌చుక్ తన దీక్షను విరమిస్తున్నట్లు ప్రకటించారు. లడఖ్ రాజధానిలో ఉవ్వెత్తున ఎగిసిన హింసాకాండతో ఆయన తీవ్రమనస్తాపం చెంది దీక్షను విరమిస్తూ విడియో సందేశం విడుదలచేసారు. లడఖ్ యువత శాంతి సంయమనం పాటించాలని పిలుపు నిచ్చారు. వందలాదిమంది యువకులు వీధుల్లోకి వచ్చి రాళ్లురువ్వడం, వాహనాలు దగ్ధంచేయడంతోపాటు స్థానిక బిజెపి, ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పుపెట్టడంతో ఆయన ఆందోళన వ్యక్తంచేసారు. హింసతో మన సమస్యలు పరిష్కారం కావని యువత ప్రత్యేకించి నిరసనకారులు సంయమనం పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి ఆందోళనలు పరిస్థితిని మరింత దిగజారుస్తాయని, లడక్‌లో అయినా దేశంలో అయినా మనం అస్థిరతను కోరుకోవడంలేదని వాంగ్‌ఛుక్ తెలిపారు.

# లడఖ్ కోసం ఎగసిపడిన నిరసనలు





## బిజెపి కార్యాలయం దగ్ధం, పోలీస్ వాహనానికి నిప్పు

### రాళ్లురువ్విన ఆందోళనకారులు, జన్‌జెడ్ ఉద్యమం అంటున్న యువత

**లేహ్, సెప్టెంబరు 25:** కేంద్ర పాలితప్రాంతంగా ఉన్న లడఖ్‌కు రాష్ట్రహోదా ఇవ్వాలని, అంతేకాకుండా తమ ప్రాంతాన్ని రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో చేర్చాలని కోరుతూ నిర్వహిస్తున్న లడఖ్ వాసుల ఆందోళనలు తీవ్రతరం చేసారు. ఆందోళనకారులు లడఖ్ రాజధాని లేహ్‌ను స్తంభింపచేసారు. బుధవారం తమ నిరసనలతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బిజెపి కార్యాలయాన్ని తగులబెట్టారు. పోలీస్ వాన్‌ను కూడా దగ్ధంచేసారు. దీనితో పోలీసులు ఆందోళన కారులను కట్టడిచేసేందుకు టియర్‌గ్యాస్ ప్రయోగించారు.అయినా ఆందోళనకారులు ముందుకురావడంతో లాఠీఛార్జిచేసారు. ఆందోళన ఉధృతిని చూస్తుంటే నేపాల్ తరహా జెన్‌జడ్ ఉద్యమంగా మారుతున్నట్లు లడఖ్ యంత్రాంగం భావిస్తోంది. బిజెపి ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వం వెంటనే తమతో చర్చలు జరపాలని వారుడిమాండ్‌చేస్తున్నారు. కొందరు యువత పోలీసు సిబ్బందితో ఘర్షణ పడి వారిపైరాళ్లురువ్వారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు వాహనాల పైనా రాళ్ల రువ్వడంతో అదనపు సిబ్బందిని మొహరించారు. సెక్షన్ 163 నిషేదపుటుత్తర్వులను లడఖ్ ప్రాంతంలో జారీచేసారు. ఐదుగురికంటే ఎక్కువమంది గుమికూడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. లడఖ్ అపెక్స్ బాడీ(ల్యాబ్) యువజనవిభాగం ఈ నిరసనకు పిలుపునిచ్చింది. 35రోజుల నుంచి అంటే ఈనెల 10వ తేదీనుంచి 15 మంది నిరవధిక దీక్షలో ఉన్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమించడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆధ్వర్యంలో ఈనిరవధిక రిలే దీక్షలు, సమ్మె కొనసాగుతోంది. ఆందోళన కారులు శాంతియుతంగా ఉండాలని శాంతియుత నిరసన ప్రదర్శనలకే పరిమితం కావాలంటూ పిలుపునిచ్చారు. యువత భావోద్వేగాలకు లోనుకావద్దని చెప్పిన వాంగ్‌చుక్ వారికి ఉద్యోగాలు నష్టపోతున్నామని, ప్రజాస్వామ్యయుతంగా వచ్చే హక్కులు కోల్పోతున్నామన్న భావన ఉందని వాంగ్‌చుక్ అన్నారు.

కేంద్రం వెంటనే చర్చలను ముందుకు జరిపి సంప్రదింపులు చేయాలని అక్టోబరు ఆరునుంచి ఈనెలాఖరుకు మార్చాలని కోరారు. కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ బుధవారం కార్గిల్‌జిల్లాలో బంద్‌కు పిలుపునిచ్చింది. రాష్ట్ర హోదా, ఆరోషెడ్యూలులో చేర్చాలన్న డిమాండ్లతో ఈ కూటమి బంద్ పిలుపు ఇచ్చింది. నిరవధిక దీక్షలుచేస్తున్న వాంగ్‌చుక్ ఇతరులకు కూడా మా మద్దతు ఉంటుందని కెడిఎ కోకన్వీనర్ అస్గర్ కర్బాలాయ్ అన్నారు. నాలుగు రోజులపాటు లడక్‌లో నిర్వహించే వార్షిక వేడుకలను నిరసనల కారణంగా రద్దుచేసారు. లడఖ్ పాలనాయంత్రంగా ఈ వేడుకలు రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది.

# ప్రముఖ కన్నడ రచయిత బైరప్ప కన్నుమూత

## గుండెపోటుతో మృతి, ప్రధాని మోడీ దిగ్భ్రాంతి, సంతాపం

**బెంగళూరు, సెప్టెంబరు 25:** ప్రముఖ కన్నడ నవలా రచయిత ఎస్ఎల్ బైరప్ప (94) కన్నుమూశారు. బుధవారంనాడు ఓప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. 'ప్రముఖ భారత నవలా రచయిత, తత్వవేత్త, పద్మశ్రీ, పద్మభూషణ, సరస్వతి సమ్మాన్ పురస్కార గ్రహీత ఎస్ఎల్ బైరప్ప మధ్యాహ్నాం గుండెపోటుకు గురయ్యాడు. హుటాహుటిన ఆస్పత్రి తీసుకువచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, అప్పటికే ఆయన ప్రాణాలు విడిచారు' అని ఆస్పత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. బైరప్ప రాసిన వంశవృక్షం, దాతు, పర్వ, మందార తదితర నవలలతో పేరుగాంచారు. కన్నడ నుంచి ఇంగ్లీషు, ఇతర భాషలలోకి అనువదించారు. పద్మ భూషణ్, పద్మశ్రీ, సరస్వతి సమ్మాన్, సాహిత్య అకాడమీ తదితరఅవార్డులు అందుకున్నారు. 'నాయి-నీరలు', 'మాతదానా', 'వంశ వృక్షం', 'తబ్బలియు నీనాదే మగను', తదితర నవలలు సినిమాలుగా వచ్చాయి. 'గృహ భంగే', 'దాతు' నవలల ఆధారంగా టీవీ సీరి యల్స్ ప్రసారమయ్యాయి. పద్మవిభూషణ్ బైరప్ప మృతిపట్ల ప్రధానిమోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన తన ఆలోచనాత్మక రచ నలతో కన్నడ సాహిత్యాన్ని ఎంతోసుసంపన్నం చేశారు. ఆయన రచనలు తరతరాలుగా సమాజానికి ప్రేరణనిస్తాయని అభిప్రాయపడ్డారు. "మన చరిత్ర, సంస్కృతిపట్ల ఆయనకున్న అచంచలమైన మక్కువ భవిష్యత్‌లో మనస్సులను ప్రేరేపిస్తూనే ఉంటుంది. ఈ విషాద సమయంలో నా ఆలోచనలు ఆయన కుటుంబం, అభిమానులతో ఉన్నాయి'అని ప్రధాని పేర్కొన్నారు. ఆయన మృతికిసంతాపం చెబుతూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# నేషనల్ మాల్‌లో ట్రంప్-ఎప్‌స్టీన్‌ల విగ్రహాలు

**వాషింగ్టన్‌డిసి, సెప్టెంబరు 25:** లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటూ జైలులోనే అనుమానాస్పది స్థితిలోమరణించిన జెఫ్రీఎప్‌స్టీన్‌తో ట్రంప్ హుషారుగా కరచాలనం చేసుకుంటున్నట్లు ఉన్న విగ్రహం ఇపుడు వాషింగ్టన్ వాసుల్లో ఆసక్తిని రేకెత్తించింది. నేషనల్ మాల్‌లో తూర్పువైపున అద్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జెఫ్రీ ఎప్‌స్టీన్‌లు హుషారుగా కరచాలనంచేసుకుంటున్న విగ్రహాన్ని రూపొందించి అక్కడ ఏర్పాటుచేసారు.పైగా ఈ శిలాఫలకంపై అద్యక్షుడు ట్రంప్, ఆయన అనుంగుమిత్రుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌లమధ్య ఉన్న స్నేహ బంధాన్ని వేడుకచేసుకుంటున్నాం అని రాసి పెట్టారు. నేషనల్‌పార్క్ సర్వీస్ అధికారులు ఈ పెయింట్ వేసిన ఈ రజత విగ్రహాన్ని ఏర్పాటుచేసేందు అనుమతించారని తెలుస్తోంది. అయితే ఈ విగ్రహం ఎవరు తయారు చేసారు. రాజకీయంగా అప్రదిష్టపాలుచేసేందుకేనా అన్న ఊహాగానాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈవిగ్రహం ఏర్పాటులోఆంతర్యం బయటికి తెలియ లేదు. అలాగే విగ్రహంతయారుచేసిందెవరన్నది కూడా తెలియకపోయినా గతంలో ఇలాంటి విగ్రహాలే మరికొన్ని ట్రంప్‌పై రూపొందించారు. జనవరి 6వ తేదీ నిరసనలకు గౌరవంగా అని పేర్కొంటూ ట్రంప్ విగ్రహం కూడా రూపొందించారు. నియంత ఆమోదించారు అన్న నినాదంతో మరో విగ్రహాన్ని కూడా గతంలో రూపొందించినట్లు తెలుస్తోంది. అలాగేమరికొన్ని కొటేషన్లు ట్రంప్‌చెప్పినవి ఉదహరిస్తూ ఈ విగ్రహాలురూపొందించారు. వ్లాదిమిర్‌పుతిన్, జైర్ బోల్సనారో, కిమ్‌జాంగ్ ఉన్, విక్టర్ ఆర్బాన్ తదితరులతో ట్రంప్‌పరిచయాలను కూడా ఈసందర్భంగా ప్రస్తావించారు.



# కుటుంబంలో నలుగురిని హత్యచేసిన టీనేజర్‌కు 100 యేళ్ల జైలు

### 40 లక్షల పాక్ రూపీ జరిమానా

### లాహోర్ సెషన్స్‌కోర్టు సంచలన తీర్పు

**లాహోర్,సెప్టెంబరు 25:** కుటుంబంలో తల్లి, సోదరి, ఇద్దరు సోదరులను హత్యచేసినందుకుగాను పాకిస్తాన్‌కు చెందిన ఒక టీనేజర్‌కు కోర్టు 100యేళ్లపాటు కారాగారశిక్ష విధించింది. ఆన్‌లైన్‌గేమింగ్ పబ్‌జి ఆడేందుకు అడ్డుకున్నందుకుగాను ఘర్షణపెరిగి కోపోద్రిక్తుడైన టీనేజర్ ఇంట్లో అందరినీ చంపినట్లు కోర్టు అభిప్రాయపడింది. 2022లో ఈ సంఘటన చోటుచేసుకుంది. లాహోర్ అదనపు జడ్జి రియాజ్ అహ్మద్ నిందితుడికి 100ఏళ్ల కఠిన కారాగారశిక్ష విధించారు. నిందితుడు 17 ఏళ్ల జైన్ ఆలీ ఘోరమైన అకృత్యానికి పాల్పడినట్లు జడ్జి అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా 40 లక్షల పాకిస్తాన్ రూపాయల జరిమానాకూడా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ ఆధారాలతో సహా నిరూపితంచేసిందని, సాక్ష్యాలు నిందితుడు ఈ ఘోరానికి పాల్పడినట్లు రుజువుచేస్తున్నాయని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఆతని వయసు దృష్ట్యా నిందితుడికి నాలుగు జైలు శిక్షలుఅంటే ఒక్కొకక్కటి 25 ఏళ్లపాటు జైలు జీవితం అనుభవించాలని తీర్పుచెప్పారు. లాహోర్‌లోని అత్యంత జనసాంద్రత కలిగిన కహ్నా ప్రాంతంలో జైన్‌ఆలీ 14 ఏళ్ల యువకుడు అంతేకాకుండా పబ్జీ గేమ్ ఆడాలని తహతహ ఎక్కువఉండేది. తరచూ ఆతడి తల్లి నహీద్ ముబారక్ మందలించేది. గేమ్‌లో ఇచ్చిన టార్గెట్లు సాధించలేకపోవడంతో ఒక్కసారిగా జైన్ ఆలీలో అసహనం పెరిగిపోయింది. వెంటనే అక్కడే ఉన్న టీనేజర్ తన తల్లి భద్రపరుచుకున్న పిస్టల్ తీసుకునని ఆమెగదిలోకి వెళ్లి ఆమె నిద్రిస్తున్న సమయంలో కాల్చి చంపేసాడు.

# విద్యార్థినులపై స్వామీజీ లైంగిక వేధింపులు





**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** ఢిల్లీలోని విలాసవంతమైన వసంత్ కుంజ్ ప్రాంతంలో ఉన్న ఓ ఆశ్రమం లోని స్వామీజీపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. దాదాపు డజన్ మంది కన్నా ఎక్కువ మంది మహిళలు ఆ స్వామీజీపై ఫిర్యాదుచేసినట్లు పోలీసులు చెప్పారు. శ్రీ శారద ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న స్వామి చైతన్యానంద సరస్వతి అలియాస్ పార్థసారధి అనే స్వామీజీపై కేసు నమోదు చేశారు. బలహీన వర్గాల కేటగిరీలో పిజి మేనేజ్మెంట్ డిప్లొమా కోర్సులు చదువుతున్న విద్యార్థినులు ఆ ఫిర్యాదు చేశారు. ఆ ఆశ్రమంలోని 32 మంది విద్యార్థినులను పోలీసులు విచారించారు. దీంట్లో సుమారు 17 మంది అమ్మాయిలు స్వామీ చైతన్యానందపై ఆరోపణలు చేశారు. ద్వేషపూరిత భాషను వాడుతున్నారని, శృంగారభరిత టెక్స్ట్ మెసేజ్‌లు చేస్తున్నారని, భౌతికంగా తాకేందుకు ప్రయత్నిస్తున్నారని మహిళలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. డైరెక్టర్‌కు లొంగిపోవాలని ఆ ఆశ్రమంలోని మహిళా సిబ్బంది, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది కూడా వత్తిడి చేస్తున్నట్లు విద్యార్థినులు ఆరోపించారు. ఆశ్రమంలో పనిచేస్తున్న వార్డెన్లు.. నిందితుడికి తమను పరిచయం చేసినట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. స్టూడెంట్స్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా స్వామీ చైతన్యానందపై లైంగిక వేధింపుల కేసు బుక్ చేసినట్లు డిసిపి అమిత్ గోయల్ తెలిపారు. పోలీసులు సిసిటివి పుటేజ్‌ను పరిశీలించారు. నిందితుడి అడ్రస్‌లో తనిఖీలు చేశారు.ఆ స్వామీజీ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఆగ్రా వద్ద ఆయన ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడ గాలింపు చేపట్టారు. దర్యాప్తు సమయంలో ఇన్స్‌టిట్యూట్ బేస్మెంట్‌లో ఉన్న వోల్వో కారును పోలీసులు స్వాధీనం చేస్తుకున్నారు. ఆ వాహనాన్ని స్వామీ చైతన్యానంద వాడినట్లు గుర్తించారు. అయితే ఆ కారుకు నకిలీ డిప్లమాటిక్ నెంబర్ ప్లేట్ (39యూఎన్ 1) ఉండటంతో ఆ కారును సీజ్ చేశారు. నిందారోపణలు రావడంతో ఆశ్రమ అడ్మినిస్ట్రేషన్ ఆ స్వామీజీని తొలగించింది. శృంగేరిలోని దక్షిణామ్నాయ శ్రీశారదా పీఠం ఢిల్లీలో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నది. ప్రస్తుత ఘటన నేప థ్యంలో ఆ పీఠం ఓ ప్రకటన జారీచేసింది. స్వామీ చైతన్యానంద ప్రవర్తన, కార్యకలాపాలు అక్రమంగా, అసహజంగా, పీఠానికి వ్యతిరేకంగా ఉన్నట్లు పేర్కొన్నది. నిందిత స్వామీజీతో అన్ని సంబంధాలను తెంచుకున్నట్లు ఆ పీఠం పేర్కొన్నది.

# రష్యా విమానాలను కూల్చేయండి



## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** ప్రపంచంలోని రెండు భారీ శక్తుల మధ్య వివాదం ముదురుతోంది. నాటో కూటమి దేశాల గగనతల సరిహద్దులను ఉల్లంఘించి రష్యా ఫైటర్ జెట్లు దూసుకురావడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే రష్యా విమానాలను కూల్చేస్తామన్నారు. ఆయన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. ఆ తర్వాత మాట్లాడుతూ అలాంటి పరిస్థితుల్లో నాటో సభ్యదేశాలు రష్యా విమానాలను కూల్చేయాలా? అని ప్రశ్నించారు. అందుకు ట్రంప్ అవును కూల్చేస్తాం అని బదులిచ్చారు. ఇటీవల కాలంలో నాటో దేశాలైన పోలాండ్, ఎస్తోనియా సహా పలు నాటో సరిహద్దుల్లోకి రష్యా ఫైటర్ జెట్లు చొరబడిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ట్రంప్ రష్యా, ఉక్రెయిన్‌పై ట్రూత్‌లో ఓ పోస్టు పెట్టారు. ఉక్రెయిన్2014 నుంచి కోల్పోయిన తన భూభాగం మొత్తం తిరిగి పొందగలదని తాను అభిప్రాయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ యుద్ధం రష్యాకు ఓ పేపర్ టైగర్‌గా మార్చేసింది. ఈ యుద్ధం వల్ల దానికి భారీగా డబ్బు ఖర్చవుతోంది. పెట్రోలియం విక్రయాలతో నిధుల సంపాదన కష్టంగా మారిందన్నారు. సమయం, ఓపిక, ఐరోపా సమాఖ్య, ముఖ్యంగా నాటో మద్దతుతో ఉక్రెయిన్ తన భూభాగం తిరిగి పొందడం ఎందుకు సాధ్యం కాదు. అంతకుమించి చేతలకు సమయం ఆసన్నమైంది అని ఈ పోస్టులో హెచ్చరించారు. ట్రంప్ పోస్టు భారీ మార్పుకు చిహ్నమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. అమెరికా నాయకుడు ఓ గేమ్ ఛేంజర్‌అని అభివర్ణించాడు. ట్రంప్‌తో భేటీ సమయంలో యుద్ధక్షేత్రంలో ఏం జరుగుతోందో తాను వివరించినట్లు చెప్పారు. ఆయనకు మరిన్ని విషయాలు కూడా తెలుసని చెప్పారు. ట్రంప్ పోస్టు చేసిన కొద్దిసేపటికి అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో మాత్రం దీనికి భిన్నంగా స్పందించారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని సైనిక చర్యలతో ముగించలేమన్నారు. కేవలం చర్చల ద్వారానే ఇది సాధ్యమని తెలిపారు. ఈ విషయాన్ని ఆయన ఐక్యకరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో పేర్కొన్నారు. ఈ ప్రమాదకర సంక్షోభానికి శాంతియుత పరిష్కారం తీసుకొచ్చేందుకు అమెరికా అన్నా ప్రయత్నాలు చేస్తోందన్నారు.

# సంక్షిప్తంగా..

## డాక్టర్ కోర్సు ఇష్టంలేదని అడ్మిషన్ రోజే ఆత్మహత్య

**ముంబయి, సెప్టెంబరు 25:** నీట్‌పరీక్షలో అత్యధిక మార్కులు సాధించినా తనకు డాక్టర్ చదవడం ఇష్టంలేదని ఒక విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా, సందేవాహి తాలూకాలోని నవర్గావ్ గ్రామానికి చెందిన అనురాగ్ అనిల్ బోర్కర్ (19 ఏళ్లు) నీట్ యూజీ 2025 పరీక్షలో 99.99 శాతం పర్సంటైల్ సాధించాడు. ఒబిసి కేటగిరీలో ఆల్ ఇండియా లెవల్‌లో 1475వ ర్యాంక్ సాధించాడు. అతని ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఉన్న వైద్య కళాశాలలో సీటు కూడా లభించింది. అయితే వైద్య కళాశాలలో అడ్మిషన్ కోసం బయలుదేరాల్సిన రోజునే అతను తన ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విద్యార్థి బలవన్మరణానికి పాల్పడడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. వారికి ఒక సూసైడ్‌నోట్ దొరికింది. అయితే అందులోని పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించలేదు. కానీ ఆ నోట్‌లో తనకు డాక్టర్ కావడం ఇష్టం లేదంటూ ఆ యువకుడు రాసినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నవర్గావ్ పోలీసులు పేర్కొన్నారు.

## బీహార్‌లో ఎంఐఎం ఒంటరిగానే బరిలోకి



**పాట్నా, సెప్టెంబర్ 25:** బీహార్‌లో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ఒంటరిగానే పోటీ చేయనుంది. అధికార బిజెపి- జెడియూ ఎన్డీయే కూటమిని ఓడించడానికి మహాఘట్‌బంధన్ చేరాలని ప్రయత్నించినప్పటికీ ఆశించిన స్పందన రాలేదని ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ వాపోయారు. ఆర్జేడీకి మూడుసార్లు లేఖలు రాసినా ప్రతిస్పందన లేదని, అందుకే ఒంటరిగానే బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఒవైసీ ఇప్పటికే సీమాంచల్ ప్రాంతంలో ఎంఐఎం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 2020 ఎన్నికల్లో 19 స్థానాల్లో పోటీ ఐదు సీట్లు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. సీమాంచల్ రీజియన్‌లోని పుర్నియా, కటిహార్, కిషన్‌గంజ్, అరారియా జిల్లాలో ముస్లింల జనాభా గణనీయంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో 15 స్థానాల్లో పోటీ చేయగా, ఏ ఒక్క స్థానంలోనూ విజయం సాధించలేకపోయింది. ఎంఐఎం అధినేత ఒవైసీ సెప్టెంబర్ 27 నుంచి సీమాంచల్ న్యాయ్ యాత్ర పేరుతో కిషన్ గంజ్ నుంచి ప్రచారం ప్రారంభించనున్నారు.

## 5 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 24న ఎన్నికలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి ఇసి షెడ్యూల్ విడుదల చేసింది. జమ్మూకాశ్మీర్‌కు సంబంధించి పెద్దల సభలో 2021 ఫిబ్రవరి నుంచి ఆ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అక్టోబర్ 24న ఎన్నికలు జరుగనున్నాయి. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున కొత్తగా ఎన్నికైన సభ్యుల పదవీకాలం అత్యున్నత న్యాయస్థానం ఇచ్చే తీర్పుపై ఆధారపడి ఉంటుందని ఇసి వివరించింది. ఇసి కథనం ప్రకారం, నాలుగు ఖాళీలు ఆయా వార్షిక కాలపరిమితిలో ఉండేవి, ఇద్దరు సభ్యులు ఫిబ్రవరి 15, 2021న పదవీ విరమణ చేయగా, మరో ఇద్దరు ఫిబ్రవరి 10, 2021కి ముందే పదవీ విరమణ చేశారు. ఏకే వాలియా వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (1994) కేసులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈసీ ప్రస్తావించింది. వీటితోపాటు పంజాబ్‌లో ఒకస్థానానికి ఎన్నికలకమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది.

## మిగ్-21కు ఇక వీడ్కోలు!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 25:** భారత వాయుసేనకు కొన్ని దశాబ్దాలుగా వెన్నెముక వలె ఉండి ఎన్నో యుద్ధాల్లో విజయాన్ని అందించిన మిగ్ - 21కు వాయుసేన చీఫ్ ఎపి సింగ్ వీడ్కోలు పలకనున్నారు. చండీగఢ్‌లో యువసేన కేంద్రం వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. ఐఎఎఫ్ చీఫ్ స్వయంగా మిగ్ -21 బైసన్‌పై చివరి సార్టికివెళ్లనున్నారు. ఈ రకం విమానం భారత్‌లో తొలిసారి అడుగుపెట్టింది కూడా ఈ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లోనే కావడం విశేషం. నాడు ఫస్ట్‌సూపర్ సోనిక్స్‌గా వ్యవహరించే 28వ స్క్వాడ్రన్‌కు వీటిని మొదటిసారి అప్పగించారు. వింగ్ కమాండర్ దిల్బాగ్ సింగ్ దీనికి నాయకత్వం వహించారు. ఆ తర్వాత ఆయన ఎయిర్ చీఫ్ మార్షల్ స్థాయికి ఎదిగారు. ఇక మిగ్ -21లు కూడా దాదాపు 60 ఏళ్లకు పైగా వాయుసేనకు సేవలు అందించాయి.

## పుడమికి సారాన్ని ఇచ్చే నేస్తాలివి..!



- నారింజ రంగు పుట్టగొడుగులు గుర్తింపు
- యోగి వేమన విశ్వవిద్యాలయ విద్యార్థుల ఘనత
- తినేందుకు పనికిరావు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో, (జర్నలిస్ట్ ఫైల్):** నారింజ రంగులోని ఈ పుట్టగొడుగులను వైఎస్సార్ కడప జిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయ పరిశోధక విద్యార్థులు గుర్తించారు. ఏపీలో మొదటిసారి తమ వర్సిటీలో గుర్తించినట్లు వైవీయూ వృక్షశాస్త్ర ఆచార్యులు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వీటిని కేశర పుట్టగొడుగులు అంటారని, తినడానికి పనికిరావని చెప్పారు. భూమిని గుల్లబరచడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. మొదట శ్రీలంకలో, ఆ తర్వాత ఖమ్మం, వరంగల్ అటవీ ప్రాంతాల్లో వీటిని కనుగొన్నారని పేర్కొన్నారు. రాలిపోయిన ఆకులు, కలప దుంగలపై పెరిగే ఈ పుట్టగొడుగులు వాటిని త్వరగా కుళ్లిపోయేలా చేసి మట్టిలో కలిపేస్తాయని

## కుట్టు శిక్షణ పూర్తయిన మహిళలకు సర్టిఫికెట్లు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** మూడు నెలల కిందట కురగల్లు గ్రామంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రారంభించిన ఉచిత కుట్టు శిక్షణ సెంటర్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎస్ఆర్ఎం ఫౌండేషన్ సర్టిఫికెట్లను అందజేసింది. కురగల్లు గ్రామానికి చెందిన సుమారు 30 మంది యువతులు కుట్టు శిక్షణ, కంప్యూటర్ ఆపరేటింగ్ ట్రైనింగ్ను పూర్తి చేసుకున్నారు. డిజైనింగ్ బ్లౌజులు, పంజాబీ డ్రెస్సులు, గాగ్రా, చుడిదార్ వంటి డ్రెస్సులను స్వయంగా కుట్టడం నేర్చుకున్నారు. ఎస్ఆర్ఎం ఫౌండేషన్ మూడు నెలల కిందట ఈ సెంటర్ను ప్రారంభించి ఉచితంగా వీరికి శిక్షణ అందిస్తోంది. గురువారం ఉదయం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా, మీడియా పీఆరోవో వేణుగోపాల్ తో పాటు చెన్నై నుంచి వచ్చిన రమేష్ కన్నన్, మరియరసులతో పాటు ట్రైనింగ్ టీచర్లు ప్రమీల, ధనకుమారిలు సర్టిఫికెట్లు అందజేసి మహిళలకు అభినందనలు తెలిపారు. అక్టోబరు 1వ తేదీ నుంచి రెండవ బ్యాచ్ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

## మెగా డీఎస్సీ నియామక పత్రాలు అందించడం సంతోషకరం




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** అమరావతి సచివాలయం ప్రాంగణంలో గురువారం జరిగిన మెగా డీఎస్సీ – 2025 లో నూతనంగా నియమితులైన 16,347 మంది అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఇద్దరు చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులతో కలిసి పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ గారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చింది.
పండుగ వాతావరణంలో డీఎస్సీ విజేతలకు వారి కుటుంబసభ్యుల మధ్య నియామక పత్రాలు అందజేయటం ఎంపికైన అభ్యర్థులకు చాలా సంతోషంగా ఉందని మన్నవ మోహనకృష్ణ అన్నారు.

# మెగా డీఎస్సీ సూపర్‌హిట్ : సీఎం చంద్రబాబు వెల్లడి

- 15,941 మందికి నియామక పత్రాలు అందజేత
- పాల్గొన్న మంత్రి లోకేష్, మంత్రులు, ఎమ్మెల్యేలు
- అట్టహాసంగా జరిగిన కార్యక్రమం



ఉమ్మడి. గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్) మెగా డీఎస్సీ సాధ్యమా అన్నారు.. మెగా డీఎస్సీని సూపర్ హిట్ చేసి చూపించామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలగపూడిలోని సచివాలయం సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన వేదికపై 15,941 మంది మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఇకపై ప్రతి ఏడాది డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందని.. నిరుద్యోగులు ప్రిపేర్ అవుతూ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్ పైనే పెట్టానని గుర్తు చేశారు. టీచర్లుగా నియామక పత్రాలు తీసుకున్న అందరిని అభినందించారు. అవినీతి లేకుండా.. పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టి టీచర్ల నియామకం చేపట్టామని వెల్లడించారు. బాబు ష్యూరిటీ.. జాబు గ్యారెంటీ అని చెప్పాను.. దాన్ని నిజం చేస్తున్నానన్నారు. రూ. 10 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకున్నామని 10 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని తెలిపారు. 15 ఏళ్లల్లో 14 సార్లు డీఎస్సీ పెట్టి 1,96,619 ఉద్యోగాలిచ్చామని పేర్కొన్నారు. ఏపీలో ఓ చేతకాని పక్షం ఉంది... మంచి చేయరు.. మంచి జరుగుతుంటే చూసి ఓర్వలేరని మండిపడ్డారు. డీఎస్సీని అడ్డుకునేందుకు 106 కేసులు వేశారు.. కానీ, ఇబ్బందులను అధిగమించి డీఎస్సీ నిర్వహించిన లోకేశ్ టీంను అభినందించారు. మహిళలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తెచ్చాం... సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని వెల్లడించారు. ప్రధాని సూపర్ జీఎస్టీ తెచ్చి... ధరలు తగ్గించారని అన్నారు.
పోస్టింగుల కోసం పైరవీలు చేసే పరిస్థితి గతంలో ఉండేది... కానీ తెదేపా ప్రభుత్వంలో ఎప్పుడూ ప్రతిభ ఆధారంగానే పోస్టింగులు ఇచ్చామని తెలిపారు. విద్యా రంగంలో సంస్కరణలు తెస్తున్నామని, సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్నభోజనం అందిస్తున్నామని తెలిపారు. పేరెంట్–టీచరు మీటింగులు నిర్వహిస్తున్నాం. మన బడి–మన భవిష్యత్ పేరుతో మౌలిక సదుపాయాల కల్పన చేపడుతున్నామని అన్నారు. టీచర్ల బదిలీల చట్టంతో పారదర్శకంగా ఒక్క ఫిర్యాదు కూడా లేకుండా టీచర్ల బదిలీల ప్రక్రియ పూర్తి చేశామని గుర్తు చేశారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలున్నా... ప్రతి ఒక్కరికి రూ. 15 వేలు చొప్పున ఇచ్చామని వెల్లడించారు. నారా లోకేశ్.. నో బ్యాగ్ డే విధానం తెచ్చారని ఇది వినూత్నంగా ఉందన్నారు. ఈసారి స్కూళ్లు తెరిచేలోగానే స్కూల్ కిట్లు, పుస్తకాలు ఇచ్చామని తెలిపారు. అభివృద్ధితో ఉద్యోగాలు వస్తాయి... ఆదాయం పెరుగుతుంది.. సంక్షేమం సజావుగా సాగించవచ్చని స్పష్టం చేశారు. విలువలతో కూడిన విద్యను అందించేలా టీచర్లంతా పని చేయాలని సూచించారు. పిల్లల్లో నైతిక విలువలను పెంచేలా టీచర్లు పాఠాలు చెప్పాలన్నారు. పిల్లల్లో నైపుణ్యాలు పెంచే బాధ్యత టీచర్లు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో విద్యా రంగంలో ఎలాంటి మార్పులు రాబోతున్నాయననేది టీచర్లు ఊహించగలగాలని తెలిపారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా టీచర్లు అప్డేట్ అవుతూ ఉండాలన్నారు. నేను నిత్య విద్యార్థిని... కొత్త విషయాలు నేర్చుకుంటాను.. ప్రజలకు ఉపయోగపడతాయనుకుంటే వాటిని అమలు చేస్తానన్నారు. 2019–24 మధ్య కాలం విద్యా వ్యవస్థకు ఓ శాపం.. 10 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ స్కూళ్ల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిపోయారు... ఏపీ విద్యా రంగాన్ని 19వ స్థానానికి దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లిష్ మీడియం పేరుతో ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే విద్యా వ్యవస్థలో మార్పులు వచ్చాయని వెల్లడించారు. నో అడ్మిషన్లు బోర్డులు పెట్టే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలను తెచ్చారు... ఇది మరింతగా పెరగాలని అభిప్రాయపడ్డారు. విద్యా శాఖ కఠినంగా ఉంటుందని చెప్పాను.. అయినా లోకేశ్ ఛాలెంజ్‌గా తీసుకున్నారన్నారు. ప్రాథమిక విద్య బాగుంటే ఉన్నత చదువులు అద్భుతంగా ఉంటాయి.. దీంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందని చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖమంత్రి నారా లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మెగా డీఎస్సీ విజేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జీఎస్టీ సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

- గుంటూరులో బీజేపీ ఆధ్వర్యంలో జీఎస్టీ అవగాహన సదస్సు




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలను ప్రజలకు వివరించే ఉద్దేశంతో గుంటూరు జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. పార్టీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇరవై సూత్రాల చైర్మన్ లంకా దినకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జీఎస్టీ రిఫార్మ్స్ వల్ల వినియోగదారుల కొనుగోలు శక్తి పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతోందని ఆయన పేర్కొన్నారు. లంకా దినకర్ మాట్లాడుతూ, "ఆత్మనిర్భర్ నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ రిఫార్మ్స్" ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంకల్పాన్ని విజయవంతం చేయడం లక్ష్యమని అన్నారు. వ్యాపారులు ప్రజలకు తగ్గిన ధరల ప్రయోజనం అందజేయడం తమ నైతిక బాధ్యతగా చూడాలని సూచించారు. సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వచ్చిన కొత్త నిర్ణయాలతో జీఎస్టీ స్లాబులు రెండు కేటగిరీలకు సరళీకరించడాన్ని ఆయన స్వాగతించారు. ప్రజలకు నాణ్యమైన వస్తువులు, సేవలు సరసమైన ధరకే అందేలా జీఎస్టీ అధికారులు, వినియోగదారుల కమిషన్, ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ కృషి చేయాలని దినకర్ కోరారు. మారుతి కార్ల భారీ విక్రయాలు, నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపుతో సంస్కరణల ఫలితం ప్రజలకు నేరుగా అందుతోందని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, చిన్న వాహనాలపై పన్నులు తగ్గించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ జీఎస్టీ రీఫార్మ్స్ వల్ల దేశ ఆర్థిక రంగం పరుగులు పెడుతుందని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఆఫ్ జీఎస్టీ నాగేశ్వరరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, వ్యాపారవేత్తలు, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

## దంత సమస్యల పట్ల నిర్లక్ష్యం పనికి రాదు

- సిజిహెచ్ఎస్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విద్య



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మానవ శరీరంలో ముఖ్యమైన దంతాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిజిహెచ్ఎస్ ( కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం ) సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి. విద్య సూచించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా గురువారం నగరంపాలెం లోని సిజిహెచ్ఎస్ వెల్ నెస్ కేంద్రంలో అమరావతి డెంటల్ హాస్పిటల్ సౌజన్యంతొ ఉచిత దంత పరీక్షలు, దంత సమస్యలపై అవగాహనా సదస్సు జరిగింది. సదస్సులో డాక్టర్ విద్య మాట్లాడుతూ..దంత సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే, అది ఇతర వ్యాధులకు దారితీయవచ్చునని తెలిపారు. నొప్పిలేని దంత సమస్యలను అశ్రద్ధ చేయరాదన్నారు. దంతాలకు హాని చేసే వాటిని దూరంగా ఉంచాలన్నారు. నిత్యం నీళ్లతో దంతాలను పుక్కిలిస్తే అవి ఆరోగ్యంగా ఉంటాయన్నారు. దంత సంరక్షణ అనేది తరచూ వైద్యుల సమక్షంలో జరిగితే, భవిష్యత్తులో జరిగే అనర్థాలను నివారించవచ్చునన్నారు. విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ దంత సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం, సామాజిక సేవా సంస్థలు ఉచిత దంత వైద్య శిబిరాలను తరుచూ నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహనా కల్పించాలని కోరారు. అమరావతి డెంటల్ హాస్పిటల్ డాక్టర్లు సౌమ్య, కీర్తి మాట్లాడుతూ..దంత సమస్యలకు పలు ఆధునిక చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. దంతాల పరిరక్షణ విధానాలను వారు వివరించారు. దంత వ్యాధులను ఆలస్యం చేస్తే ఎటువంటి దుష్ప్రభావాలు ఉంటాయో తెలిపారు. అనంతరం డాక్టర్లు 79 మంది దంతాలను ఉచితంగా పరీక్షించి, సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సిజిహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్య చౌదరి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ బి. హేమా సుందరి, జాన్ బీ, ఫార్మాసిస్టులు అయోషా, సునీల్, మురళీ కృష్ణ, రామారావు, మోహన్, మక్బుల్, రత్నరాజు,వెంకటేశ్వర్లు, నందమణి పాల్గొన్నారు.

## గుంటూరు జిజిహెచ్‌లో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు చెందిన ఫార్మసీ సిబ్బంది, ఏపీ ఫార్మసిస్ట్ అసోసియేషన్ గుంటూరు జిల్లా సమైక్యంగా గురువారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఆకర్షణీయంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.సి. రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుందరాచారి పాల్గొన్నారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ ఫార్మాసిస్టులు వైద్య రంగానికి వెన్నెముకలాంటివారని, రోగుల అవసరాల తీర్చడంలో ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని అన్నారు. వారి కృషికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. డాక్టర్ ఎన్. సుందరాచారి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని, సమాజానికి ఫార్మసిస్టులు అందిస్తున్న సేవలు విశేషమైనవని కొనియాడారు.

## దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త, అంత్యోదయ సిద్ధాంత రూపకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 109వ జయంతి వేడుకలు గుంటూరులోని జెకేసీ కాలేజీ రోడ్‌లో మోర్యా ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ, పండిట్ ఉపాధ్యాయ భారత రాజకీయ చరిత్రలో ఒక స్ఫూర్తిదాయక నాయకుడు, జనసంఘ్ పార్టీ సైద్ధాంతిక స్థంభమని అన్నారు. ఆయన ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతం పేదల శ్రేయస్సుపైనే కేంద్రీకృతమై ఉందని, సమాజంలోని చివరి వ్యక్తికీ అభివృద్ధి ఫలాలు చేరాలని ఆకాంక్షించారని వివరించారు. ఏకాత్మ మనవత్వవాదంతో దేశానికి మార్గదర్శకత్వం వహించిన వ్యక్తి అని కొనియాడారు.
ప్రధాని నరేంద్ర మోడీ "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్" భావనతో ముందుకు సాగుతూ పండిట్ ఉపాధ్యాయ చూపిన మార్గంలో నడుస్తున్నారని వీర్రాజు అన్నారు. నేటి అనేక సంక్షేమ పథకాలు అంత్యోదయ స్ఫూర్తితోనే రూపుదిద్దుకున్నాయని, అట్టడుగు వర్గాల అభివృద్ధికే ప్రధాన ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, దర్శనపు శ్రీనివాస్, భీమినేని చంద్రశేఖర్, యడ్లపాటి స్వరూపారాణి, ఈదర శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, గాజుల వెంకయ్య నాయుడు, చరక కుమార్ గౌడ్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్టి 2.0 ప్రయోజనాలపై దసరా నుండి దీపావళి వరకు ప్రచార కార్యక్రమం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తుసేవల పన్ను తగ్గింపు జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు అనగా దసరా నుండి దీపావళి వరకూ ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వెల్లడించారు. జిఎస్టి 2.0 ప్రయోజనాలపై కార్యదర్శులకు అవగాహన కల్పించేంద్నుకు గురువారం రాష్ట్ర సచివాలయంలో సెన్సిటైజేషన్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ జూన్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్టే ఈనెల 22 నుండి అమలులోకి వచ్చిన జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు దసరా నుండి దీపావళి వరకు నెలరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. కావున వివిధ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు వారి వారి శాఖలకు సంబంధించి క్షేత్రస్థాయి వరకూ ఈకార్యక్రమాన్ని తీసుకువెళ్ళి విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం జిల్లా కలక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించడం జరుగుతుందని సిఎస్ పేర్కొన్నారు.

జిఎస్టి 2.0 వల్ల రాష్ట్రానికి 8 వేల కోట్ల రూ. లు నష్టం వాటిల్లుతున్నప్పటికీ ప్రజలకు ఆమేరకు లబ్ది చేకూరుతున్న నేపధ్యంలో ప్రభుత్వం దీనిని స్వాగతించడం జరిగిందని జిఎస్ట్డీ విజయానంద్ వెల్లడించారు. జిఎస్టి 2.0 ద్వారా



ఏవిధంగా లబ్ది కలుగుతుందనే దానిపై ప్రజలకు విస్తృతంగా తెలియజేసి వారిలో పూర్తి అవగాహన కల్పించేందుకు నెలరోజుల పాటు అనగా దీపావళి ముందు రోజైన అక్టోబరు 19వ తేదీ వరకూ ఈప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సిఎస్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాలు, మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో వివిధ అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. ఇందుకు సంబంధించి గురువారం జిఓను జారీ చేయడం జరుగుతుందని సిఎస్ విజయానంద్ చెప్పారు.

రాష్ట్ర చీఫ్ కమీషనర్ ఆఫ్ స్టేట్ టాక్సెస్ బాబు ఎ సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ జిఎస్టి 2.0పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నెలరోజుల ప్రచార కార్యక్రమం వివరాలను తెలియజేశారు. ఈనెల 25 నుండి 29 వరకూ ఇంటింటికీ జిఎస్టి ఫలాలు పేరిట ప్రచార కార్యక్రమంలో భాగంగా సామాన్య ప్రజలకు గృహ, నిత్యావసర వస్తువులు, ఆహారం, మందులు, విద్యా, స్టేషనరీ, బట్టలు, క్రీడా వస్తువులు, మహిళలు, పిల్లలు, రవాణా అంశాలకు సంబంధించి జిఎస్టి తగ్గింపు వల్ల కలిగే లబ్దిపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా సెప్టెంబరు 30 నుండి అక్టోబరు 6 వరకూ వ్యవసాయం మరియు ఇతర వృత్తుల వారికి అనగా వ్యవసాయ, ఉద్యానవన ,ఉపాధిహామీ కూలీలు, మత్స్యకారులు, ఆక్వా రైతులు, ట్రేడింగ్ ఎంస్ఎంఇలు, నేత, హస్త కళాకారులు, పేపరు మరియు ప్యాకేజింగ్, సెలూన్లు, స్పా, యోగా కేంద్రాలు, జిమ్, టెక్స్ టైల్స్ రంగాల్లో పనిచేసే వారికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అక్టోబరు 7నుండి 13 వరకూ మానవ వనరుల అభివృద్ధి మరియు డిజిటల్ సాంకేతికకు సంబంధించి విద్య, జీవితబీమా మరియు ఆరోగ్య బీమా, ఎలక్ట్రానిక్స్, ఎంట్రప్రెన్యూర్ షిప్పు, ఇ–కామర్స్ అండ్ గిగ్ ఎకానమీ కి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అక్టోబరు 14 నుండి 18 వరకూ వికాస్ విస్వాస్ –నమ్మకమైన అభివృద్ధికి సంబంధించి బిల్డింగ్, డెవలపర్స్ మరియు కనస్ట్రక్షన్ మెటీరియల్, టూరిజం మరియు హాస్పిటాలిటీ, ట్రాన్సుపోర్టు మరియు లాజిస్టిక్స్, బొమ్మలు, స్పోర్ట్సు గూడ్స్, రెన్యువల్ ఎనర్జీ, ఆటోమొబైల్ మరియు మాన్యూ ఫ్యాక్చరింగ్ రంగాల్లో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. దీపావళి పర్వదినానికి ముందు రోజైన అక్టోబరు 19వ తేదీన నెలరోజుల కార్యక్రమం ముగింపు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని బాబు ఎ వివరించారు. ఈనెల రోజుల్లోను రాష్ట్ర వ్యాప్తంగా 65వేల ఈవెంట్లను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.
అదే విధంగా ఈప్రచార కార్యక్రమం పర్యవేక్షణ విజయవంతంగా నిర్వహణకు ఎస్టి చాంపియన్స్ పేరిట జిల్లా స్థాయిలో జెసి నోడల అధికారిగా జిల్లా జిఎస్టి చాంపియన్‌గా, సంబంధిత శాఖల జిల్లా అధికారి వారి శాఖ జిఎస్టి చాంపియన్ గాను, అసెంబ్లీ నియోజవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారి, మండల స్థాయిలో ఎంపిడిఓ, మున్సిపల్ కమీషనర్, గ్రామ వార్డు సచివాలయాల స్థాయిలో పంచాయితీ, వార్డు అడ్మిన్ కార్యదర్శి జిఎస్టి చాంపియన్ గా ఉంటారని చీఫ్ కమీషనర్ బాబు ఎ తెలిపారు. అంతేగాక ఈనెల రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ప్లాట్ ఫారమ్ లు, హెూర్డింగ్లు, ఇతర ఔట్ డోర్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.
ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, జిఎడి ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, ఆర్థిక, ప్రణాళికా శాఖల ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఐటి శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఆర్టీజిఎస్ సిఇఓ మరియు ఐఅండ్ పిఆర్ డైరెక్టర్ ప్రఖర్ జైన్, జిఎస్టి స్పెషల్ కమీషనర్ సౌమ్య, కమీషనర్లు రవి శంకర్, రమేశ్, అదనపు కమీషనర్ కృష్ణ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వర్చువల్ గా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఆర్పి సిసోడియా, బి. రాజశేఖర్, యంటి. కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్ కుమార్, ఎస్. సురేశ్ కుమార్, సిసిఎల్ఏ జి. జయలక్ష్మి, పలువురు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఎస్సి వర్గీకరణ బిల్లుకు మండలి ఆమోదం




○ మార్పులు చేయాలంటూనే వైసిపి మద్దతు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో షెడ్యూలు కులాల వర్గీకరణ బిల్లుకు శాసన మండలి గురువారం ఆమోదం తెలిపింది. ప్రధాన ప్రతిపక్షం ఈ బిల్లులో కొన్ని సూచనలు, సవరణలు చేయాలని చెబుతూనే బిల్లుకు మద్ధతు ఇస్తున్నట్టు ప్రకటించింది. తొలుత సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఎస్సి వర్గీకరణకు ప్రభుత్వం చట్టం రూపొంచిందన్నారు. రాష్ట్రంలోని ఎస్సిల్లో 59 ఉప కులాలను నాలుగు కేటగిరిలుగా విభజిస్తూ మొత్తం 15 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు వీలుగా ప్రజాభిప్రాయ సేకరణకు నియమించిన సీనియర్ ఐఎఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను అనుసరించి గతంలోనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. తరువాత ఈ ప్రక్రియను చట్టబద్ధం చేసేందుకు బిల్లును రూపొందించామన్నారు. ఎమ్మెల్సీ పండుల రవీంద్ర నాథ్ మాట్లాడుతూ ఎస్సిలను కులాల వారీగా విభజించడం దురదృష్టకరమన్నారు. దగ్గరగా ఉన్న కులాల మధ్య దూరం పెంచారన్నారు. తాజా పరిణామాలతో మాల, మాదిగ కులాల మధ్య అంతరాలు పెరిగాయన్నారు. ఇరు తరగతుల మధ్య సయోధ్య పెంచాలన్నారు. కొన్ని రాజకీయ శక్తులు వీరి మధ్య ఐక్యత ఉండకూదని కోరుకుంటున్నాయన్నారు. అయినా ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్సీ ఎం.అరుణ్‌కుమార్ వైసిపి హయంలోనే సామాజిక న్యాయం జరిగిందని ఇరు తరగతులకు అన్ని అంశాల్లో న్యాయం జరిగిందన్నారు. సామాజిక న్యాయం కోసం బిల్లుకు మద్ధతు ఇస్తున్నట్టు తెలిపారు. మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు మాట్లాడుతూ షెడ్యూలు కులాల మధ్య వ్యత్యాసం ఏర్పడటం సమాజానికి మంచిది కాదన్నారు. షెడ్యూల కులాల్లో ఒక తరగతి వారు ముందుంటానికి చదువు ప్రధాన కారణం అన్నారు. రెండో తరగతి వారికి కూడా చదువు కోవడానికి అవకాశాలు పెంచాలన్నారు. ఇరువురికి చదువుకు తగిన అవకాశాలను పెంచగలిగితే రిజర్వేషన్ ఫలాలు అనుభవించగలుగుతారన్నారు. ప్రతిపక్ష నాయకుడు బత్స సత్యనారాయణ మాట్లాడుతూ షెడ్యూలు కులాల వారంతా ఐక్యంగా ఉండాలని తమ పార్టీ కోరుకుంటుందన్నారు. బిల్లుకు మద్ధతు ఇస్తున్నట్టు ప్రకటించారు. మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ చైర్మన్ మోషన్ రాజు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకుని భవిష్యత్తులో చేసే సవరణలలో మార్పు చేస్తామన్నారు.

## స్వాతి సేవా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి



**చల్లపల్లి , (జర్నలిస్ట్ ఫైల్):** సేవా భావాన్ని తన అభిరుచిగా మలుచుకొని సామాజిక బాధ్యతతో జీవన విధానం కొనసాగిస్తున్న స్వాతి ఆదర్శనీయురాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. హెల్పింగ్ హాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా తెలుగు రాష్ట్రాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఢిల్లీలోని నిఫా ఆధ్వర్యంలో వరల్డ్ రికార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇంగ్లాండ్ అవార్డును అందుకొన్న కృష్ణాజిల్లా, చల్లపల్లి మండలం,కొత్త మాజేరు గ్రామానికి చెందిన ఆరేపల్లి స్వాతిని సురేష్ బాబు గురువారం కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి సమాజం పట్ల తనకున్న ప్రేమతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వాతి స్ఫూర్తిదాయకురాలని అన్నారు. తనతో పాటు తన మిత్రులు,కుటుంబ సభ్యులు, స్నేహితులను కూడా సమాజ సేవలో భాగస్వామ్యులను చేస్తూ అనేక మందికి రక్తదాన కార్యక్రమాలు నిర్వహించి వేలాదిమంది ప్రాణాలు కాపాడారని అన్నారు. విజయవాడలో వరదలు మరియు కరోనా లాంటి విపత్తుల సమయాలలో స్వాతి అత్యంత విలువైన సేవలు అందించారని కొనియాడారు. నేటి యువత ఫోన్ లు,సామాజిక మాధ్యమాల్లో అనవసర అంశాలతో గంటలకొద్దీ సమయాన్ని వృథా చేయకుండా స్వాతి చేస్తున్న సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని సాధ్యమైనంత వరకు సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇచ్చే ధోరణి అలవర్చుకోవాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు,స్వాతి లాంటి వ్యక్తుల ద్వారా సాయం పొందిన వారు సందర్భం వచ్చినప్పుడు ఆపదలో ఉన్నవారికి తిరిగి సాయం చేసే తత్వం అలవర్చుకోవాలని సూచించారు. స్వాతి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కృష్ణా,ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్ ల దృష్టి కి తీసుకెళ్లనున్నట్లు సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరేపల్లి శ్రీనివాసరావు,రమాదేవి,చంద్రశేఖర్ రావు,పాస్టర్ లు పి. శుభకుమార్,అశోక్,నిరీక్షన్,ఎస్తేరు రాణి,మద్దాల వెంకటేశ్వరావు,కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు సీబీఐ కోర్టు గుడ్ న్యూస్



○ యూరప్ వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు సీబీఐ కోర్టు గుడ్ న్యూస్ తెలిపింది. యూరప్ వెళ్లేందుకు అనుమతించింది. అక్టోబర్ 1 నుంచి 30 మధ్య యూరప్ వెళ్లేందుకు అనుమతించాలని జగన్ తరపున దాఖలైన పిటిషన్‌పై సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు.. 15 రోజులు అనుమతిస్తూ తీర్పు ఇచ్చింది. నవంబర్ 14లోపు కోర్టుకు జగన్ వ్యక్తిగతంగా హాజరుకావాలని సూచించింది. అలాగే విదేశాల నుంచి ఎప్పుడు వచ్చారని అంశాలను వివరించాలని సీబీఐ కోర్టు ఆదేశించింది.

# గత పాలనలో ప్రజలూ బాధితులే

○ వారి ఆరాచకాలకు నేనే మొదటి బాధితుడిని
○ ప్రజాస్వామ్యం కోసం పోరాడితే కేసులు పెట్టారు
○ శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదు
○ కూటమి వచ్చాక మహిళలపై నేరాలు తగ్గుముఖం
○ సోషల్ మీడియా ఫేక్ ప్రచారాల వెనుక కుట్రల్ని వెలికితీస్తాం
○ శాసనసభలో శాంతి భద్రతల అంశంపై జరిగిన చర్చలో సీఎం చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** గత పాలకుల అరాచకానికి ప్రజలతో పాటు నేనూ బాధితున్నేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తప్పుడు కేసులతో వేధించడానికి అరెస్టు చేసి జైల్లో పెట్టారనీ... జైల్లో కూడా తన కదలికలు చూడ్డానికి డ్రోన్ ఎగరేశారనీ అన్నారు. గురువారం శాసనసభలో శాంతిభద్రతల అంశంపై స్వల్ప కాలిక చర్చలో పాల్గొన్న ముఖ్యమంత్రి రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి – సామాజిక మాధ్యమాల అంశంపై ప్రసంగించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ "గత ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన వారందరిపైనా కేసులు పెట్టారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడుపై అత్యాచారయత్నం కేసులు పెట్టారు. ప్రస్తుత స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ గత పాలకులు పెట్టిన కేసుల బాధితులే. నాపై 17 కేసులు పెట్టి వేధించారు. ఇది అరాచకానికి పరాకాష్ట. యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి లోకేశ్ ప్రజలను కలిస్తే కేసులు పెట్టారు. అంగళ్లులో నాపై దాడి చేయించి మళ్ళీ నా పైనే కేసులు పెట్టారు. ప్రజలతో మాట్లాడేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుంటే కరెంటు తొలగించి వేధించారు. ఇప్పుడు మంత్రులుగా ఉన్న అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్దన రెడ్డి, సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర, జేసీ ప్రభాకర్ రెడ్డి, పులివర్తి నాని, నిమ్మల రామానాయుడు, దేవినేని ఉమ, బీటెక్ రవి, కూన రవి ఇలా నేతలపై కేసులు పెట్టి వేధించారు. రఘురామకృష్ణం రాజును అరెస్టు చేసినప్పుడు ఆయన్ను ఏం చేస్తారోననే ఆందోళన వెంటాడింది. గత ప్రభుత్వ హయాంలో అందరిపైనా కేసులు, వేధింపులే. అమరావతి రైతులు, మహిళలు రాజధాని కోసం పోరాడుతుంటే బాత్ రూమ్ లపై డ్రోన్లు ఎగరేశారు. అమరావతి రైతులు న్యాయస్థానం నుంచి దేవస్థానం పాదయాత్రకూ అడుగడుగునా అడ్డంకులు కల్పించారు. గత పాలకుల అరాచకాలు భరించలేక పారిశ్రామిక వేత్తలు కూడా రాష్ట్రం నుంచి పారిపోయారు. అప్పటి గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ తన పరిశ్రమను పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లిపోయారు. రాజకీయాల నుంచి కూడా తప్పుకున్నారు. ఆఖరుకు సింగపూర్ లాంటి ప్రభుత్వంపైనా అభాండాలు వేసి ప్రాజెక్టు నుంచి వైదొలిగేలా చేశారు. 2019–24 వరకూ రాష్ట్రం తీవ్రస్థాయిలో అరాచకాలను భరించింది. గత పాలకులు టీడీపీ కార్యాలయంపై కూడా దాడి చేశారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**మేం కక్ష సాధింపు రాజకీయాలు చేయం**

"బాధ్యత కలిగిన నాయకుడిని కాబట్టే ప్రజలు నన్ను నాలుగోసారి ఎన్నుకున్నారు. కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే అరెస్టు చేసి ఉండేవాళ్లం. గతంలో సీఎంగా ఉండగా అలిపిరి వద్ద నక్సల్స్ 23 క్లైమోర్ మైన్లు బ్లాస్ట్ చేశారు. అలాంటి పరిస్థితుల నుంచి బయటపడి నిన్న మళ్లీ తిరుమల శ్రీవారికి సీఎంగా 14వ సారి పట్టు వస్త్రాలు సమర్పించాను. రాజకీయ, ఆర్ధిక, సామాజిక, సమస్యల గురించి నక్సల్స్ కు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తే నాపై క్లైమోర్ మైన్స్ పేల్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం నా ప్రాణాలు త్యాగం చేయడానికైనా సిద్ధపడ్డాను. రాయలసీమలోనూ కరడు గట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను రూపు మాపాం. టీడీపీ తీసుకున్న విధానాల వల్లే రాయలసీమలో ఇప్పుడు ఫ్యాక్షన్ లేదు. ఉమ్మడి రాష్ట్రంలో మత విద్వేషాలనూ సమర్ధవంతంగా కట్టడి చేశాం. గత పాలకుల హయాంలో ఇబ్బందులు ఎదుర్కొన్న ఎమ్మెల్యేల ఆవేశానికీ అర్ధం ఉంది. అయితే వారు ప్రవర్తించిన విధంగానే మనం కూడా ప్రవర్తించకూడదు. తప్పు చేసిన ఎవరికైనా శిక్షతధ్యం. చట్ట ప్రకారం ప్రభుత్వం వ్యవహరిస్తుంది. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదు. స్వర్ణాంధ్ర 2047 విజన్ కు అనుగుణంగా ఏపీ ముందుకు వెళ్లాలి. అగ్రస్థాయి రాష్ట్రంగా ఏపీ ఉండాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం కట్టడికి చర్యలు**

"సామాజిక మాధ్యమాల్లో ఫేక్ ప్రచారాలు, ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం. గత పాలకుల హయాంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి పోలీసు వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారు. కూటమి అధికారంలోకి వచ్చిన సమయం నుంచి ఒక్కో వ్యవస్థనూ సరిదిద్దుకుంటూ వస్తున్నాం. నేరస్థులకు అండగా ఉండే రాజకీయాలను నేను ఇంతవరకూ చూడలేదు. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తులను బయటపెట్టాలి. వారి ముసుగు తీస్తే ప్రజలే అర్ధం చేసుకుంటారు. నిద్ర లేచినప్పటి నుంచి నిద్ర పోయే వం- కూ జాగ్రత్తగా ఉండే నాపై కూడా సామాజిక మాధ్యమాల్లో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేటియం బ్యాచ్ లను పెట్టి పెద్ద ఎత్తున ఫేక్ న్యూస్ ప్రచారం చేయిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారం పోయాక మరోలా ప్రవర్తిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా తీవ్రస్థాయిలో వేధింపులు చేస్తున్నారు. వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంపై క్యాబినెట్ సబ్ కమిటీ వేశాం. ఫేక్ ప్రచారాలు చేసే నేరస్తులు ప్రపంచంలో ఎక్కడున్నా తీసుకువస్తాం. మహిళలపై కించపరిచేలా పోస్టులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ తరహా నేరాలపై సీరియస్ గా వ్యవహరిస్తాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు

**క్రిమినల్స్ తో కలిసి పోయి ముఖ్యమంత్రికే నోటీసులా**

"వివేకా హత్య తర్వాత క్రైమ్ సీన్ లో సీఐ శంకరయ్య ఉన్నారు. సీఎంకు నోటీసులు పంపించటం అంటే ఎంత ధైర్యం చేసి ఉండాలి. నేరం జరిగినప్పుడు సీన్ ఆఫ్ అఫెన్సులో సీఐగా విధులు నిర్వహించి నేరం జరిగిన ప్రాంతాన్ని రక్షించాలి. కానీ క్రిమినల్స్ తో కలిసి పోయి ముఖ్యమంత్రికే నోటీసు పంపించే స్థాయికి సీఐ శంకరయ్య చేరుకున్నారు. వివేకా హత్య కేసులో ముఖ్యమంత్రిగా నన్నూ ఏమార్చారు. అక్కడున్న రక్తాన్ని శుభ్రం చేశారు. ఏమీ తెలియని వారిలా అమాయకంగా వచ్చి స్టేట్ మెంట్ ఇచ్చారు. చివరకు గుండె పోటు కాదు గొడ్డలి పోటు అని తేలింది. ఫేక్ రాజకీయాలకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ. రాజకీయపరంగా చాలా మందిని ఎదుర్కొన్న నేను ఇప్పుడు నేరస్తుల్ని ఎదుర్కోవాల్సి వస్తోంది". అని సీఎం అన్నారు.

**రౌడీ రాజకీయాలు చెల్లవు**

"పొగాకు రైతుల్ని పరామర్శించడానికి అని వెళ్లి సినిమా డైలాగులు వేశారు. మహిళలను కించపరిచేలా పోస్టింగ్లు పెట్టి అవమానించారు. సింగయ్యను కారు కింద తొక్కించేసి తిరిగి బురదజల్లే ప్రయత్నం చేశారు. కనీసం మానవత్వం లేకుండా పొదల్లోకి విసిరేసి వెళ్లిపోయారు. తిరిగి మృతుడి భార్యతో అసత్యాలు చెప్పించారు. తన భర్త జగన్ కారు కిందపడి చనిపోలేదు, పోలీసులు అంబులెన్సులో తీసుకెళ్లి చంపేశారని ప్రకటన చేయించారు. మామిడి రైతులను పరామర్శించడానికి వెళ్లి రోడ్డుపై మామిడికాయలు ట్రాక్టర్లతో తొక్కించారు. రౌడీ రాజకీయాలకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ. కూటమి ప్రభుత్వంలో రౌడీ రాజకీయాలు చేయాలంటే కదరదు' అని సీఎం స్పష్టం చేశారు.

**మహిళలపై నేరాలను కట్టడి చేశాం**

---మహిళలపై రాష్ట్రంలో నేరాలు తగ్గాయి. గతంతో పోల్చుకుంటే 4.84 శాతం మేర మహిళలపై నేరాలు తగ్గాయి. వరకట్న మరణాలు 43 శాతం తగ్గాయి. మహిళా హత్యలు 15 తగ్గాయి. మహిళా ఆత్మహత్యలు 59 శాతం తగ్గాయి. మహిళలపై సైబర్ వేధింపులు 17 శాతం తగ్గాయి. వరకట్న వేధింపులు 25 శాతం తగ్గాయి. మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారిలో 343 మందికి శిక్షలు పడ్డాయి. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాం. మహిళలపై నేరం జరిగితే కేవలం 8-10 నిముషాల్లోపే ఘటనా స్థలికి చేరుకునేలా చర్యలుచేపట్టాం. శక్తి టీమ్ లను ఏర్పాటు చేసి మహిళల రక్షణపట్ల చర్యలు చేపడుతున్నాం. సెక్సువల్ అఫెండర్లపైనా రౌడీషీట్లను ఓపెన్ చేస్తాం, ఆన్ లైన్ లోనూ నేరస్తుల ఫోటోలు పెడతాం. రాష్ట్రంలో ఓ ఉద్యమంగా డ్రగ్స్ నియంత్రణ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈగల్ టాస్క్ ఫోర్సు ద్వారా గంజాయి, మాదక ద్రవ్యాలను కట్టడి చేస్తున్నాం. రాష్ట్రంలో గంజాయిని జీరో కల్టివేషన్ స్థాయికి తీసుకువచ్చాం. అయితే పొరుగు రాష్ట్రాల నుంచి కొంతమేర అక్రమంగా రవాణా అవుతోంది. రాష్ట్రంలో సైబర్ ఫ్రాడ్స్ కోట్లలో నష్ట పోతున్నారు. బాగా చదువుకున్న వ్యక్తులు కూడా సైబర్ ఫ్రాడ్స్ ఉచ్చులో పడి డబ్బు నష్ట పోతున్నారు. సైబర్ క్రైమ్స్, ఫ్రాడ్స్ ఉచ్చులో పడొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. సైబర్ క్రైమ్ నియంత్రణకు ప్రత్యేకంగా కార్యాచరణ చేపట్టాం. ఫోరెన్సిక్స్ ను కూడా బలోపేతం చేస్తున్నాం. శాంతిభద్రతల విషయంలో ఎప్పుడూ రాజీ పడలేదు." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# విజ్ఞాన్ లో ఆసక్తికరంగా సాగుతున్న జాతీయ చెస్ ఛాంపియన్ పోటీలు

○ కొనసాగుతున్న నాలుగో రౌండ్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** విజ్ఞాన్ యూనివర్సిటీ, గుంటూరు, సెప్టెంబర్ 25: 62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్ నాలుగో రౌండ్ ముగిసే సరికి ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు, నలుగురు ఇంటర్నేషనల్ మాస్టర్లు చెరో నాలుగు పాయింట్లతో అగ్రస్థానాన్ని పంచుకున్నారు. టాప్ బోర్డులపై జీఎంలు, ఐఎంల మధ్య ఉత్కంఠభరితమైన పోటీలు జరిగాయి. మాజీ ఆసియా చాంపియన్, రెండో సీడ్ జీఎం సూర్యశేఖర్ గంగూలీ , అలాగే భారత 2700 రేటింగ్ దాటిన రెండో ఆటగాడు జీఎం కృష్ణన్ సశికిరణ్ తమ ప్రతిభను చూపించారు. ఇంగ్లీష్ ఓపెనింగ్‌లో తమిళనాడు ఆటగాడు ఐఎం మనీష్ ఆంటో క్రిస్టియానో, బిషప్ త్యాగం చేసి ధైర్యంగా పోరాడినా, గంగూలీ ఎక్స్చేంజ్ సాక్రిఫైస్ తర్వాత రూక్ త్యాగంతో ఆధిపత్యం సాధించాడు. అదనపు బిషప్ ఆధిక్యం వలన గంగూలీ 46 మూవ్‌లలో గెలుపొందాడు. జీఎం కృష్ణన్ సశికిరణ్, ఒడిశా ఆటగాడు హర్షిత్ రంజన్ సహూపై పెట్రోవ్ డిఫెన్స్‌లో తన నాలుగో వరుస విజయాన్ని సాధించాడు. క్వీన్, రూక్‌లతో తీవ్రమైన దాడి చేసి, క్వీన్‌ను బిషప్, రూక్‌లకు మార్చుకుని 32 మూవ్‌లలో చెక్‌మేట్ జాలాన్ని నేసాడు. ఆంధ్ర ఆటగాడు జీఎం ఎం.ఆర్. లలిత్ బాబు ఫ్రెంచ్ డిఫెన్స్‌లో స్థిరమైన ఆట ఆడి, అలేఖ్య ముఖర్జీపై విజయం సాధించాడు. 22వ మూవ్‌కి అన్ని పీసులు మారిపోవడంతో చివర్లో పాన్





ఎండ్గేమ్‌లో లలిత్ తన అనుభవంతో గెలిచాడు. మాజీ తమిళనాడు సబ్ జూనియర్ చాంపియన్ వి.ఎస్. నందీష్, రైల్వేల ఐఎం అరోన్యక్ ఘోష్తో టూ నైట్స్ ఇటాలియన్ గేమ్‌లో 55 మూవ్‌ల వరకు కచ్చితంగా రక్షణ చేసినా, చివర్లో అనుభవం గెలిచి, ఘోష్ విజయం సాధించాడు. మూడో సీడ్ జీఎం ఎస్.పి. సేతురామన్ , హర్యానా ఆటగాడు ఐఎం ఆదిత్య దింగ్రా తప్పిదం వల్ల ఓటమి నుండి తప్పించుకున్నాడు. ఫిలిడోర్ డిఫెన్స్‌ను సరిగా ఆడకపోవడంతో ఆదిత్యకు ఆధిక్యం దొరికినా, ఒక తప్పు పాన్ క్యాప్చర్ కారణంగా గేమ్ డ్రాగా ముగిసింది. కేరళ ఐఎం హెచ్. గౌతమ్ కృష్ణ, గుజరాత్ ఆటగాడు ఘూదవి వీర్భద్రసింగ్పై అద్భుతంగా ఆడాడు. మెటీరియల్ సమానంగా ఉన్నప్పటికీ, పొజిషనల్ ఆధిక్యం గౌతమ్ వైపు ఉండడంతో, రూక్ త్యాగం చేసి బ్యాక్ ర్యాంక్ చెక్‌మేట్‌తో విజయం సాధించాడు. మూడో రౌండ్‌లో డ్రా తర్వాత, టాప్ సీడ్ పీ. ఇనియన్ (తమిళనాడు) మళ్లీ విజయ పథంలోకి వచ్చాడు. లిలిశ్రేయస్ దాస్ (ఢిల్లీ)లిలిపై క్వీన్స్ గాంబిట్ డిక్లైన్డ్ గేమ్‌లో గెలుపొందాడు. మాజీ తమిళనాడు చాంపియన్ ఎన్. సురేంద్రన్, రైల్వేల జీఎం ఎన్.ఆర్. విజయేష్ను డ్రాలో నిలిపాడు. అలాగే లిలిజీఎం దీప్ సెంగుప్తా )లిలిను ఎషాన్ వాధావన్ (ఢిల్లీ) డ్రాలో ఆపాడు. ఇప్పటి వరకు టోర్నమెంట్‌లోని పొడవైన గేమ్ ఆంధ్ర ఆటగాడు ఐఎం ఎస్. రవితేజ (రైల్వేలు), గుజరాత్ ఆటగాడు జిహాన్ తేజస్ షా మధ్య సాగింది. రవితేజ 140 మూవ్‌ల తర్వాత బిషప్, నైట్ కాంబినేషన్‌తో చెక్‌మేట్ చేశాడు.

# తిరుమలలో భక్తులకు నూతన వసతి సముదాయం

○ భక్తుల రద్దీ, క్యూలైన్ నిర్వహణ సహా పర్యవేక్షణకు సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్
○ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తో కలిసి ప్రారంభించిన సీఎం చంద్రబాబు నాయుడు



**తిరుమల,(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు నూతన వసతి సముదాయం అందుబాటులోకి వచ్చింది. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు భక్తుల కోసం నిర్మించిన నూతన వసతి సముదాయం వేంకటాద్రి నిలయాన్ని ప్రారంభించారు. ఈ పిలిగ్రిమ్స్ అమెనిటీస్ కాంప్లెక్సు-5ను రూ.102 కోట్ల వ్యయంతో టీటీడీ నిర్మించింది. ఎలాంటి ముందస్తు బుకింగ్ లేకుండా తిరుమల వచ్చిన భక్తులకు వసతి కల్పించేందుకు నూతన వసతి సముదాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఒకేసారి 4 వేల మంది భక్తులకు ఉచిత వసతి సౌకర్యం కల్పించేలా దీన్ని సిద్ధం చేశారు. 16 డార్మిటరీలు, 2400 లాకర్లు, 24 గంటలూ వేడినీటి సదుపాయం తదితర సౌకర్యాలతో ఈ పిలిగ్రిమ్స్ అమెనిటీస్ సెంటర్-5ను తీర్చిదిద్దారు. ఒకేసారి 80 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకునేందుకు వీలుగా కల్యాణ కట్టను కూడా ఈ పీఏసీ-5 ప్రాంగణంలో టీటీడీ ఏర్పాటు చేసింది. ఒకేసారి 1400 మంది భక్తులు భోజనం చేసేందుకు వీలుగా ఈ కాంప్లెక్సులో రెండు భారీ డైనింగ్ హాళ్లను కూడా అందుబాటులో ఉంచారు. ఈ వసతి సముదాయాన్ని ప్రారంభించిన అనంతరం ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తో కలిసి సీఎం చంద్రబాబు భవనాన్ని పరిశీలించారు. వసతి గృహం బుకింగ్ కౌంటర్లోకి వెళ్లిన సీఎం, ఉపరాష్ట్రపతి బుకింగ్ జరుగుతున్న విధానాన్ని తెలుసుకున్నారు. ఓ భక్తురాలికి తొలి వసతి బుకింగ్ టోకెన్‌ను సీఎం చంద్రబాబు అందించారు. ఈ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసిన వేస్ట్ కలెక్షన్ యంత్రాన్ని ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి ఆసక్తిగా పరిశీలించారు. తిరుమల పోటులో ప్రసాదం తయారీ కోసం వినియోగించేందుకు ఏఐ ఆధారిత సాంకేతికతతో అందుబాటులోకి తెచ్చిన కొత్త సార్టింగ్ యంత్రాలను ప్రారంభించారు. ఈ యంత్రాల సాయంతో ప్రసాదంలో నాణ్యత పెంచడంతోపాటు... తక్కువ సమయంలో ఎక్కువ ప్రసాదాన్ని సిద్దం చేసే అవకాశం కలుగుతుందని అధికారులు వివరించారు.

**టెక్నాలజీతో క్యూలైన్ల నిర్వహణకు ఐసీసీ సెంటర్**

శ్రీవారి దర్శనం కోసం భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గించేలా అత్యుత్తమ విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. వైకుంఠం క్యూకాంప్లెక్సులో నూతనంగా నిర్మించిన అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను సీఎం ప్రారంభించారు. ప్రస్తుతం గంటకు 4500 మంది భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారని అధికారులు సీఎంకు వివరించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం రెడీ అనలటిక్స్, మెషీన్ లెర్నింగ్ సాయంతో వేంకటేశ్వరుని దర్శనం కోసం నిరీక్షణలో ఎంత మంది భక్తులు ఉన్నారో గుర్తించి అందుకు అనుగుణంగా క్యూలైన్ నిర్వహణ చేపడతామని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం... గంటకు 5500 మంది వరకూ భక్తులు శ్రీవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే భక్తులు వేచి ఉండే క్యూ కాంప్లెక్సులు, కంపార్టెమెంట్లల్లో భక్తి భావన పెంపోందించేలా ఆధ్యాత్మిక వీడియోలను, శ్రీవారి చరిత్రను ప్రదర్శించాలని ఆదేశించారు.

తిరుమల కొండపైకి నిషేధిత వస్తువులు తీసుకురాకుండా అలిపిరి వద్దే నిలువరించేలా ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచే టెక్నాలజీ సాయంతో పర్యవేక్షించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానించిన సీసీ కెమెరాల సాయంతో అలిపిరి నుంచే రద్దీ హీట్ మ్యాపులను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. దీంతో పాటు టీటీడీ నిర్వహణలోని అన్ని దేవాలయాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ తో అనుసంధానించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తిరుమల కొండను అత్యంత పరిశుభ్రంగా ఉంచడంతో పాటు.. సుందరంగా కన్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ మేరకు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. తిరుమల గిరుల్లో ఎక్కడైనా అపరిశుభ్ర వాతావరణం కన్పిస్తే వెంటనే అలెర్ట్ చేసి... ఆ చెత్తను తొలగించేలా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక గ్రీనరీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏడుకొండలపై 90 శాతానికి పైగా గ్రీనరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467